# ఎపి హజ్ బులెటిన్

తెలుగు, ఉర్దూ భాషల్లో ప్రచురితం

సంపుటి 1 సంచిక 1
ఫిబ్రవరి - 2017
జమాదిల్ అవ్వల్ హిజ్రీ 1438

చీఫ్ ఎడిటర్
మహమ్మద్ లియాఖత్ అలీ

ఎడిటర్
హాజి డా.ఫజల్

ఎడిటోరియల్ బోర్డు
ముఫ్తి ముహమ్మద్ ఫారూక్
ముఫ్తి కె.ముహమ్మద్ రఫీ
మౌలానా ముహమ్మద్ ఇల్యాస్

హజ్ కమిటీ సభ్యులు
మోమిన్ అహ్మద్ హుస్సేన్ ఛైర్మన్
ముహమ్మద్ అహ్మద్ షరీఫ్ ఎమ్మెల్సీ
ముహమ్మద్ ఇక్బాల్ ఐపిఎస్
షేక్ మస్తాన్ షరీఫ్ జడ్పీటీసీ
టి.మహబూబ్‌సాబ్ ఎంపీపీ
అబ్దుల్ చినరెహ్మాన్
హాజీ షేక్ హసన్ బాషా
సయ్యద్ షా మఖ్దూమ్ బుఖారి
కె.ఎం.డి.ఉస్మాన్

సంవత్సర చందా 85/- 15/-

ప్రచురణ
ఎపి స్టేట్ హజ్ కమిటీ
మసీదు వీధి, లబ్బీపేట్, విజయవాడ
టోల్‌ఫ్రీ నెం: 18004257873



## ఈ సంచికలో....

| | |
|---|---|
| సంపాదకీయం | 6 |
| హజ్ గైడ్ లైన్స్ | 7 |
| తెలుసుకోవాల్సిన అరబీ పదాలు | 13 |
| హజ్ ముందు చేయవలసిన పనులు | 14 |
| మహా ప్రవక్త ఇబ్రహీం | 15 |
| హజ్ ప్రయోజనాలు-ప్రాముఖ్యత | 18 |
| ప్రవక్త ఇబ్రాహీ(అలై) హజ్ ప్రకటన | 19 |
| ఖుర్ ఆన్ ఉపదేశం - అల్లాహ్ గుణగణాలు | 20 |
| సందేహాలు - సమాధానాలు | 24 |
| మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ పథకాలు | 26 |

# సందేశం

*2017 హజ్ యాత్రకు వెళ్ళే హాజీల సౌలభ్యం కొరకు ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే విధంగా తెలుగులో సులభమైన హజ్ విధి విధానాలు, విదేశంలో ఎలా వుండాలి తదితర అంశాలతో* **ఎపి హజ్ బులెటిన్** *మాసపత్రికను హజ్ కమిటీ రూపొందించడం అభినందనీయం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హజ్ యాత్రికులకు సకల సౌకర్యాలు కల్పించే ఉద్దేశ్యంతో రూ.12 కోట్ల ఖర్చుతో కడపలో హజ్ హౌస్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశాం. విజయవాడలో కూడా అత్యాధునికమైన హజ్ హౌస్ నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. 2016-17 బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమం వికాసం కోసం అత్యధికంగా రూ.710 కోట్ల నిధులు కేటాయించాం. ప్రతి ముస్లిం సోదరుడు రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకునేందుకు సుమారు 10 లక్షల కుటుంబాలకు రూ.30 కోట్ల వ్యయంతో 'రంజాన్ తోఫా'ను అందజేశాం. విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంటు కొరకు రూ.160 కోట్లు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కొరకు రూ.60 కోట్లు, హాస్టల్ భవన నిర్మాణం కొరకు రూ.84 కోట్లు కేటాయించి మైనార్టీల విద్యావికాసానికి పెద్ద పీట వేశాం. రూ.50 వేలు ఆర్థిక సహకారం అందించే దుల్హన్ పథకం కొరకు రూ.54 కోట్లు కేటాయించాం. ఇమామ్, మౌజన్‌లకు ప్రతి నెల గౌరవ వేతనం రూ.5 వేలు, రూ.3 వేలు అందించడానికి రూ.24 కోట్ల బడ్జెట్ కేటాయించాం. ముస్లింల సంక్షేమం వారి వికాసం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో విశేషమైన కృషి చేస్తుందని తెలియజేస్తున్నాను.*

*2017 జులై 25 నుంచి ఆగస్టు 26 వరకు పవిత్ర మక్కా, మదీనా పట్టణాలకు హజ్ యాత్రకు వెళ్ళే హాజీలందరి ప్రయాణం సఫలం కావాలని, మన రాష్ట్రానికి సురక్షితంగా తిరిగి రావాలని మనసారా కోరుకుంటున్నాను. మీరు నిర్వహించే పవిత్ర హజ్ యాత్రలో రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధి కొరకు అల్లాహ్‌ను ప్రత్యేకంగా ప్రార్థించాలని కోరుతున్నాను.*

**నారా చంద్రబాబునాయుడు**
*ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు*

# సందేశం

రాష్ట్ర విభజనతో హజ్ కమిటీ రెండుగా చీలిపోయింది. విశాఖపట్నం దర్గాకు సంబంధించిన డబ్బుతో కట్టుకున్న హజ్‌భవనం తెలంగాణాకు పోయింది. మళ్ళీ ఖాళీ చేతులతో మనం హైదరాబాద్ నుంచి విజయవాడకు వచ్చాం. ఇలాంటి పరిస్థితుల్లో గౌరవనీయులైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు ఎపి హజ్ కమిటీకి మూడు కోట్ల రూపాయలు కేటాయించి విడుదల చేశారు. రూ. 12 కోట్లు కడపలో హజ్ భవన్ నిర్మాణానికి ఇచ్చారు. విజయవాడలో హజ్ భవన్ నిర్మాణానికి మరో 12 కోట్లు ఇచ్చారు. స్థల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుంది. వెంటనే ఆధునిక హంగులతో విశాలమైన హజ్ భవనం నిర్మాణపు పనులు చేపడతాం.

ముస్లిం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం విదేశాల్లో చదువుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు 10 లక్షల గ్రాంట్ ఇస్తున్నారు. అంతే కాకుండా మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో టోఫెల్ తదితర పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ముస్లింల సంక్షేమం, అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారు.

హజ్ యాత్రికుల్లో పూర్తిగా అవగాహన కల్పించడానికి **ఎపి హజ్ బులెటిన్** మాసపత్రిక మార్గదర్శిగా వుంటుందని నేను భావిస్తున్నాను. అయితే **ఎపి హజ్ బులెటిన్** హజ్ యాత్రికులు దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి 6 నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా ఈ పుస్తకం ఉపయోగపడుతుంది. ఆధ్యాత్మికంగా, మానసికంగా, శారీరకంగా సిద్ధమై తన హజ్ యాత్రను విజయవంతంగా హాజీ పూర్తి చేసుకుంటారని నేను ఆశిస్తున్నాను. గన్నవరం ఎయిర్ పోర్ట్ కు ఎంబార్‌కేషన్ పాయింట్ హోదా కోసం పూర్తిస్థాయిలో ప్రయత్నిస్తున్నాం.

మహ్మద్ అహ్మద్ షరీఫ్, ఎంఎల్‌సి
హజ్ కమిటీ సభ్యులు

# సందేశం

మన రాష్ట్రం నుంచి ఈ ఏడాది రెండు వేలకు పైగా యాత్రికులు హజ్‌యాత్రకు వెళ్ళనున్నారు. దేశం కాని దేశం. అక్కడ భాషా, సంస్కృతి వేరు. పైగా 50 ఏళ్ళకు పైబడిన వారు వెళ్ళడంతో చిన్న చిన్న సమస్యలు వస్తుంటాయి. ఆ సమస్యల్ని ఎలా అధిగమించాలి? విజయవంతంగా హజ్ యాత్ర పూర్తి చేసుకోవడానికి **ఎపి హజ్ బులెటిన్** మాసపత్రిక మార్గదర్శిగా వుంటుంది. ఐదారు నెలల పాటు ఈ పత్రిక చదవడం వల్ల హజ్ యాత్రికులకు సంపూర్ణంగా అవగాహన వస్తుంది. ఎప్పటికప్పుడు హజ్‌కు సంబంధించిన తాజా సమాచారం, సౌదీ ప్రభుత్వ నిర్ణయాలు, సెంట్రల్ హజ్ కమిటీ సూచనలు ఇందులో వున్నాయి. హజ్ యాత్రలో ఇబ్బందులు రావడం సహజం. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి ప్రతి హజ్ యాత్రికుడు తమను తాము సిద్ధం చేసుకునేలా ఎపి హజ్ బులెటిన్ ఉపయోగపడుతుంది. గ్రీన్‌లో వండుకోవడానికి అవకాశం లేదు. సిమ్ కార్డు కూడా ఇవ్వలేమని సౌదీ ప్రభుత్వం చెబుతోంది. ఆహారం విషయంలో, సిమ్ విషయంలో హజ్ యాత్రికులు సొంత ఏర్పాట్లు చేసుకోవాలి. ఒక వేళ లగేజ్ మిస్ అయినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేలా డబ్బులు తమ వద్ద పెట్టుకోవాలి. సమస్యలనేవి మీ హజ్ యాత్రకు ఇబ్బంది కలగకుండా ఎపి హజ్ బులెటిన్ సంపూర్ణ అవగాహన కల్పిస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు హజ్ యాత్రికులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించడానికి సిద్ధంగా వున్నారు. త్వరలోనే విజయవాడలో హజ్‌భవన్ నిర్మాణ పనులు చేపడ్తాం.

మోమిన్ అహ్మద్ హుస్సేన్
ఛైర్మన్, ఎపి స్టేట్ హజ్ కమిటీ

# సందేశం

*2017 హజ్ యాత్రికుల్లో చైతన్యం, హజ్ యాత్ర పట్ల అవగాహన కల్పించడంలో **ఎపి హజ్ బులెటిన్** మాసపత్రిక మార్గదర్శిగా వుంటుందని నేను భావిస్తున్నాను. దేశంలోనే మరే రాష్ట్రం ఇలాంటి ప్రయత్నం చేయలేదు. హజ్ యాత్రికులకు దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచే ప్రత్యేక శిక్షణ ఇచ్చే విధంగా **ఎపి హజ్ బులెటిన్** మాసపత్రికను రూపొందించడం అభినందనీయం.*

*సౌదీ అరేబియాలోని మక్కా, మదీనాలో యాత్రికులు ఎలా వ్యవహరించాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఆధ్యాత్మికంగా ఎలా వుండాలి? తదితర అంశాలపై ఇస్లామిక్ స్కాలర్స్ సూచనలు ఇందులో వున్నాయి. మన రాష్ట్రం నుంచి వెళ్ళే ఏ ఒక్క యాత్రికుడు ఇబ్బంది పడకుండా, ఆరోగ్యంగా వుండి హజ్ యాత్ర పూర్తి చేసుకునేలా **ఎపి హజ్ బులెటిన్** మాసపత్రిక దోహదపడుతుంది.*

*ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు విజయవాడ గన్నవరం ఎయిర్ పోర్ట్ నుంచే హజ్ యాత్రికుల్ని పంపించడానికి ఆసక్తిగా వున్నారు. గన్నవరం ఎంబార్కేషన్ పాయింట్ హోదా కోసం గట్టిగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కడప, విజయవాడలో హజ్ భవనాలు నిర్మించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు బడ్జెట్ కూడా కేటాయించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో హజ్ భవనం స్థల ఎంపిక కోసం చర్యలు చేపట్టాం, వెంటనే నిర్మాణపు పనులు చేపడతాం.*

డా.పల్లె రఘునాథ్‌రెడ్డి
మైనార్టీ సంక్షేమశాఖా మంత్రి వర్యులు

# సంపాదకీయం

2016 హజ్ కంటే ముందు హజ్ కమిటీ విభజన జరిగింది. కాబట్టి తెలంగాణా హజ్ కమిటీతో ఒప్పందం మేరకు హజ్ ఏర్పాట్లు తెలంగాణా కమిటీయే చేసింది. హజ్‌హౌస్‌లో 70 శాతం వరకు వివిధ ప్రభుత్వ కార్యాలయాలు వుండటం వల్ల హజ్‌యాత్రికులకు పూర్తి స్థాయిలలో వసతి ఏర్పాటు చేయడం సాధ్యం కాలేదు. మరో ప్రక్క నిర్మాణంలో వున్న భవనంలోనే ఆంధప్రదేశ్ హజ్ యాత్రికులకు తాత్కాలిక ఏర్పాట్లు చేసినందువలన యాత్రికులు కొంత అసౌకర్యానికి గురైయ్యారు. ఈ నేపథ్యంలో గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని 2017 హజ్‌కు సంబంధించి ఎపి స్టేట్ హజ్ కమిటీ సవాల్‌గా తీసుకుంది. మొదటి ప్రయత్నంలోనే విజయవంతంగా వందశాతం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించామని చెప్పడానికి గర్వపడుతున్నాను. హజ్‌యాత్రికులకు అవగాహన కల్పించడానికి క్యాంప్‌ల ఏర్పాటుతో పాటు ప్రతి హజ్ యాత్రికుడికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి ఆరు నెలల సిలబస్ రూపొందించి ఎపి హజ్ బులెటిన్ మాసపత్రిక ద్వారా నేరుగా హజ్ యాత్రికుల ఇంటికి పంపించాలని నిర్ణయించాం. హజ్ యాత్రికులకు హజ్ యాత్ర పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడానికి ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చేసిన ప్రయత్నమే **ఎపి హజ్ బులెటిన్** మాసపత్రిక. ప్రతి హజ్ యాత్రికుడు ఎలా సిద్ధం కావాలి. మక్కా మదీనాలో ప్రతి దినం సంపూర్ణంగా, ఆధ్యాత్మికంగా వుండేలా ఈ పుస్తకం ఉపయోగపడుతుంది.

ఉపాధి కోసం చేసే ప్రయాణం ఒకటైతే, వినోదం కోసం పర్యటించడం మరొకటి. ఈ రెండు రకాల ప్రయాణాల్లో అవసరాలు, కోరికలు మనిషిని ప్రేరేపిస్తాయి. కేవలం అల్లాహ్ కోసం తనపై అల్లా విధించిన ఫర్జ్‌ను నెరవేర్చడానికి చేసే ప్రయాణమే హజ్‌యాత్ర. పాపాలకు పశ్చాత్తాపపడుతూ తన చేతల గురించి చేతులెత్తి మన్నించమని దైవాన్ని వేడుకుంటారు. చెడు ఎడల ఏహ్యాభావంతో సత్కార్యలవైపు మొగ్గుతారు. ఎవ్వరికీ తన వల్ల కష్టం కల్గించకుండా సాధ్యమైనంత వరకు ఒకరికి సాయపడాలనే ఆతురత అధికమవుతుంది. హజ్ ప్రయాణమంతా ఆరాధనే.

డబ్బుందని కాని, సంఘంలో గొప్పతనం కోసమో ఓ వ్యక్తి హజ్ యాత్ర చేయలేడు. అల్లాహ్ ఆహ్వానం మేరకే ఆ అదృష్టవంతుడు కఫన్ తొడిగి లబ్బైక్ అంటూ అల్లాహ్ గృహం కాబా వైపు ప్రయాణమవుతాడు. తన ఇంటిని, భార్యా పిల్లల్ని, బంధు మిత్రుల్ని, వ్యాపార వ్యవహారాల్ని పక్కనపెట్టి ఖర్చును, ప్రయాణంలో ఇబ్బందుల్ని ఓర్చి సంతోషంగా హజ్ యాత్ర కోసం బయలుదేరుతారో, అతని ప్రయాణం అతనిలో దైవప్రేమ, దైవభీతి, దైవం విధించిన విధిని - విధిగా తలిచే ఆలోచన ఉంది అనడానికి నిదర్శనం. ఎప్పుడైనా దైవమార్గంలో బయలుదేరవలసి వస్తే సంశయించకుండా బయలుదేరే శక్తి అతనికి వుందని, ప్రయాణంలో వచ్చే కష్టనష్టాలను ఎదుర్కోగలడని, తన ఆస్తిని, సుఖాన్ని దైవ ప్రసన్నత కోసం త్యాగం చేయగలడని నిరూపించుకునే సత్తా అతనికి వుందనుకోవాలి.

సౌదీ ప్రభుత్వం, సెంట్రల్ హజ్ కమిటీ సూచనలతో పాటు దివ్యఖుర్‌ఆన్, హదీసుల ఆధారంగా హజ్, ఉమ్రా, జియారత్‌ల గురించి ఎపి హజ్ బులిటెన్‌లో సమాచారం వుంది.

-మహమ్మద్ రియాజుద్ అలీ
చీఫ్ ఎడిటర్

# హజ్ గైడ్ లైన్స్

1) భారత పౌరసత్వం కల్గిన ముస్లింలు మాత్రమే హజ్ కమిటీ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. హజ్ చేయాలంటే వారు తప్పనిసరిగా ఇండియన్ పాస్ పోర్ట్ కలిగి వుండాలి.

2) ఒకే సారి అవకాశం: హజ్ కమిటీ ద్వారా ఒకే సారి హజ్ చేయడానికి మాత్రమే అవకాశం వుంది. ప్రతి ముస్లిం హజ్ యాత్రకు దరఖాస్తు చేయవచ్చు. కానీ పాస్ పోర్ట్ తప్పని సరి. సెంట్రల్ హజ్ కమిటీ నిర్ణయించిన 300 రూపాయల ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఆ డబ్బు వాపస్ రాదు.

3) కవర్‌లో సభ్యులు: ఒక కవర్‌లో ఐదు గురు ఫ్యామిలీ సభ్యులు, లేదా బంధువులు వుంటారు. కవర్ హెడ్ అందరి తరపున బాధ్యత తీసుకోవాల్సి వుంటుంది. రెండేళ్ళ లోపు ఇద్దరు చిన్న పిల్లలు కూడా ఒక కవర్‌లో వుండవచ్చు. ఒక కవర్‌లో ఒకరు లేదా ఐదుగురు వరకు వుండవచ్చు. కవర్ నెంబర్ ఐ హెచ్ పి ఎం ఎస్ సాఫ్ట్ వేరే ద్వారా జనరేట్ అవుతుంది. అన్నీ లావా దేవీలు కవర్ నెంబర్ ద్వారానే జరుగుతాయి. హజ్ యాత్రికులు తమ కవర్ నెంబర్ గుర్తు పెట్టుకోవాలి. కవర్ నెంబర్ ద్వారానే డ్రా తీస్తారు.

4) పాస్ పోర్ట్: మిషన్ రీడబుల్, ఇంటర్నేషనల్ పాస్ పోర్ట్ వుండాలి. పాస్ పోర్ట్ వ్యాలిడిటీ ఫిబ్రవరి 28, 2018 వరకు ఉండాలి. ఒక్క రోజు తక్కువ వున్నా అనుమతించరు. హజ్ యాత్రకు వెళ్ళాలనుకునే వారు వెంటనే రెన్యూవల్ చేసుకోవాలి.



5) అడ్రస్ ప్రూఫ్: పాస్ పోర్ట్‌లో అడ్రస్, ప్రస్తుత అడ్రస్ అదే వుంటే అడ్రస్ ప్రూఫ్‌గా పాస్ పోర్ట్ పెట్టవచ్చు. లేక పోతే ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ పెట్టాలి. కరెంట్ బిల్లు, వాటర్ బిల్లు అడ్రస్ ప్రూఫ్‌గా పెట్టవచ్చు.

6) ఎ-క్యాటగిరి: సీనియర్ సిటిజన్ (ఎ-క్యాటగిరి) దరఖాస్తూ చేసే దినానికి అనగా 02-01-2017 నాటికీ 70 సంవత్సరాలు నిండిన వారే ఎ-క్యాటగిరి కిందికి వస్తారు. 01-01-1947 కంటే ముందు జన్మించినవారై వుండాలి. (70 ఏళ్ళు పై బడిన వారు ప్రైవేట్‌గా కానీ, లేదా హజ్ కమిటీ ద్వారా కానీ హజ్ చేసి వుంటే రిజర్వ్ క్యాటగిరి కిందికి రారు.) 70 ఏళ్ళు పై బడిన హాజీ యాత్ర రద్దు చేసుకుంటే కంపెనీయన్ కూడా తన యాత్ర రద్దు చేసుకోవాల్సి వుంటుంది.

7) బి-క్యాటగిరి: 4వ సారి దరఖాస్తు చేసుకునే వారు (బి-క్యాటగిరి). నాల్గవ సారి దరఖాస్తు చేసుకునే వారు గతంలో హజ్ చేయని వారై వుండాలి. అప్పుడే రిజర్వ్ క్యాటగిరి (బి-క్యాటగిరి) వర్తిస్తోంది. బి-క్యాటగిరి అనగా వరుసగా మూడు సార్లు డ్రాలో పేరు రాని వాళ్ళు 4వ సారి దరఖాస్తు చేసుకుంటే హజ్ యాత్రకు వెళ్ళ వచ్చు. ప్రైవేట్‌గానైనా, హజ్ కమిటీ ద్వారానైనా ఎలా హజ్ చేసినా రిజర్వే

క్యాటగిరిలోకి రారు. డ్రా ద్వారానే సెలక్షన్ అవుతుంది. 4వ సారి దరఖాస్తు చేసిన వారు 1వ, 2వ, 3వ సారి వరుసగా దరఖాస్తు చేసిన కవర్ నెంబర్ దరఖాస్తులో స్పష్టంగా రాయాల్సి వుంటుంది. కవర్‌లో వున్న ప్రతి ఒక్కరూ మూడేళ్ళు దరఖాస్తు చేసి వుండాలి. కొత్త వాళ్ళు కవర్‌లో వస్తే బి-క్యాటగిరిలో కాకుండా జనరల్‌లోకి వస్తారు. ఎ, బి క్యాటగిరి వాళ్ళు తమ ఒరిజనల్ పాస్ పోర్ట్ దరఖాస్తుతో సబ్ మిట్ చేయాలి.

8) రిపీటర్: ఒక సారి హజ్ యాత్ర చేసిన వారిని రిపీటర్ అంటారు. అయితే రిపీటర్ మళ్ళీ హజ్ యాత్ర చేయాలంటే మెహరంగా వెళ్ళ వచ్చు. 70 ఏళ్ళ వృద్ధులతో పాటు కంపెనీయన్‌గా వెళ్ళ వచ్చు. అయితే సబ్సిడీ లేని టికెట్ తీసుకోవాల్సి వుంటుంది. రిపీటర్ ఫుల్ విమానం టికెట్ కొనాల్సి వుంటోంది. రిపీటర్ తప్పని సరిగా నిర్ణీత డిక్లరేషన్ ఫాం భర్తీ చేయాలి.

9) పాస్‌పోర్ట్ సబ్‌మిట్: జనరల్ క్యాటగిరి వాళ్ళు పాస్ పోర్ట్ జిరాక్స్‌తో దరఖాస్తు చేయాలి. హజ్ యాత్రికుల కవర్ నెంబర్ డ్రాలో సెలెక్ట్ అయితే, ఆ కవర్‌లో వున్న హజ్ యాత్రికులంతా ఒరిజనల్ పాస్ పోర్ట్ వెనుక పాస్ పోర్ట్ సైజ్ ఫొటో సెల్లో టేప్‌తో అతికించి మార్చి 31, 2017 లోపు స్టేట్ హజ్ కమిటీకి జమచేయాలి. నిర్ణీత తేదీ లోపు పాస్ పోర్ట్ జమ చేయకపోతే సెలక్షన్ రద్దు అవుతుంది. ఎన్ ఆర్ ఐ, తరచూ విదేశీ ప్రయాణం చేసే వారు, ఉమ్రాకు వెళ్ళే వారు రాత పూర్వకంగా హజ్ కమిటీకి విజ్ఞప్తి చేసి ఒరిజనల్ పాస్ పోర్ట్ ఇస్తే మళ్ళీ తిరిగి తీసుకోవడం కుదరదు. హజ్‌కు వెళ్ళే రోజు హజ్ యాత్రికుడికి పాస్ పోర్ట్, బోర్డింగ్ పాస్ తో పాటు ఇస్తారు.

10) డిక్లరేషన్: ప్రతి హజ్ యాత్రికుడు డిక్లరేషన్ ఇవ్వాలి. 1) 70 ఏళ్ళు పై బడిన వారు, 2) జనరల్ క్యాటగిరిలో వెళ్ళే వారు, 3) హజ్ యాత్రకు రెండవ సారి వెళ్తున్న వారు (70 ఏళ్లు పై బడిన వారికి కంపెనీయన్‌గా, మహిళలకు మెహరంగా వెళ్తున్నట్లు ప్రకటించాలి.) అయితే సబ్సిడీ లేకుండా పూర్తి టికెట్ చెల్లించాలి. 70 ఏళ్ళు పైబడిన వారు ఒక్కరే వెళ్ళ లేరు. వారితో కంపెనీయన్ తప్పనిసరి. ఒక వేళ అనివార్యకారణాల వలన వెళ్ళ లేక పోతే వేరే వారిని కంపెనీయన్‌గా తీసుకొని వెళ్ళవచ్చు.

11) నామిని: ప్రతి హజ్ యాత్రికుడు నామినిగా తమతో హజ్ యాత్రలో లేని వారు, ఇంటి వద్ద వున్న కుటుంబసభ్యుల పేరు దరఖాస్తులో రాయాలి.

12) బ్యాంక్ ఖాతా: ప్రతి హజ్ యాత్రికుడు దరఖాస్తులో కవర్ హెడ్ బ్యాంక్ ఖాతా నెంబర్ ఇవ్వాలి.

13) మహిళా హజ్: మెహరం లేకుండా ఏ మహిళా హజ్ యాత్ర చేయడం సాధ్యం కాదు. ప్రెగన్సీ వున్నా వెళ్ళలేరు. గర్భిణీలు హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోరాదు. ఒక వేళ ఎవరైనా ఆరు నెలల గర్భిణి హజ్ యాత్రకు బయలుదేరితే ఎయిర్ పోర్ట్ నుంచి ఇమిగ్రేషన్ అధికారులు వెనక్కి పంపిస్తారు. విమాన ప్రయాణానికి కూడా అడ్వాన్స్ స్టేజీలో వున్న గర్భిణీని అనుమతి ఇవ్వరు.

14) లగేజ్: హజ్ యాత్రికుడి లగేజ్ విషయంలోనూ సౌదీ ఇమిగ్రేషన్ అధికారులు కఠినంగా చర్యలు తీసుకుంటున్నారు. హజ్ యాత్రికుడు ఇష్టానుసారంగా లగేజ్ తీసుకుని వెళ్తే జిద్దా ఎయిర్ పోర్ట్ నుంచి

తిప్పి పంపిస్తున్నారు. కాబట్టి మెత్తటి మెటీరియల్‌తో తయారు చేసిన 22 కేజీల రెండు సూట్ కేసులుండాలి. సైజ్ 158 సెంటీ మీటర్ల డైమన్షన్ వుండాలి. దీనితో పాటు 10 కేజీల హ్యాండ్ బ్యాగ్ తీసుకొని వెళ్ళవచ్చు. ఈ లెక్క తప్పితే ఎయిర్ పోర్ట్ నుంచి తిరిగి వెనక్కి పంపిస్తారు. లగేజ్ విషయంలో చాలా జాగ్రత్త వహించి రెండు సూట్ కేసులు, ఒక హ్యాండ్ బ్యాగ్‌తోనే హజ్ యాత్రకు బయలుదేరాలి. బ్యాగేజ్ 22 కేజీ + 22 కేజీతో పాటు హ్యాండ్ లగేజ్ 10 కేజీలకు పరిమితి.

15) రిపోర్ట్ చేయాల్సిన సమయం: హజ్ యాత్రికులు 30 నుంచి 40 రోజుల పాటు మక్కా మదీనాలో వుండే అవకాశం వుంది. విమానం కేటాయింపు 15 రోజుల ముందే తెలుస్తుంది. వివరాలు ప్రతి హజ్



యాత్రికుడికి పంపిస్తారు. 48 గంటల ముందు హజ్ యాత్రికుడు రిపోర్ట్ చేయాల్సి వుంటుంది.



16) గ్రీన్ క్యాటగిరి: గ్రీన్ క్యాటగిరిలో వండుకోవడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని సౌదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గ్రీన్‌లో కూకింగ్ నిషేధించారు.

17) సిమ్ కార్డు: 2017లో హజ్ యాత్రికులకు సిమ్ కార్డు ఇచ్చే ప్రసక్తే లేదని సౌదీ ప్రభుత్వం స్పష్టం చేసింది. జిద్దా ఎయిర్ పోర్ట్ లో దిగిన తరువాత ప్రతి హజ్ యాత్రికుడికి ఇమిగ్రేషన్‌లో ఓ కోడ్ ఇస్తారు. ఆ కోడ్ చూపించుకొని హజ్ యాత్రికుడు మక్కాలో వ్యక్తిగతంగా సిమ్ కొనుగోలు చేయాల్సి వుంటోంది. హజ్ యాత్రికుడికి సాధ్యం అయితే వ్యక్తిగతంగా సిమ్ కార్డు కొనుగోలు చేసుకోవాల్సి వుంటుంది. సౌదీ దేశ భద్రతను దృష్టిలో పెట్టుకొని సిమ్ కార్డు విషయంలో

కఠినంగా వ్యవహరిస్తున్నారు. 2017 హజ్ కోసం సిమ్ కార్డు బ్యాన్ చేసింది సౌదీ ప్రభుత్వం.

18) ఆహారం: దేశం కాని దేశం. అక్కడ మన ఆహారం దొరకడం సాధ్యం కాదు. హజ్ యాత్ర సందర్భంగా మీనాలో సౌత్ ఇండియా ఫుడ్ ఇవ్వడం సాధ్యం కాదని మౌల్లి తేల్చి చెప్పేశారు. హజ్ యాత్రికుడు సొంత ఏర్పాట్లు చేసుకోవాలి. మీనా, అర్ఫాత్, ముజ్దలిఫా, జుమ్‌రాత్, కాబా (హరమ్ షరీఫ్), మీనా, ఇలా హజ్ యాత్ర మూమెంట్ వుంటోంది. కాబట్టి హాజీ ఆరోగ్యంగా వుండాలి. డబ్బు ఖర్చు పెట్టి బయట తినే స్థోమత కలిగి వుండాలి.

19) ఖురా - డ్రా: ప్రతి సంవత్సరం ముస్లిం జనాభా ప్రాతిపదికన సెంట్రల్ హజ్ కమిటీ కోటా నిర్ణయం జరుగుతుంది. ఖురా అంటే డ్రా. సెంట్రల్ హజ్ కమిటీ ముంబాయిలో మార్చి 5, 2017న డ్రా తీస్తుంది. మనం ఇక్కడ చూడవచ్చు. వెయిటింగ్ లిస్ట్ సీరియల్ ఆర్డర్ ప్రకారం కేటాయిస్తారు.

20) ఫొటోలు: ఫొటో సైజ్ 3.5 × 3.5 వుండాలి. ఫొటోలో ముఖం 70 శాతం కనిపించాలి. పాత ఫొటో కాకుండా మళ్ళీ తాజాగా కలర్ ఫొటో బ్యాక్ గ్రౌండ్ వైట్ వుండేలా ఫొటో దిగాలి. తలపై తెల్ల టోపీ పెట్టుకుంటే వైట్ బ్యాక్ గ్రౌండ్‌లో కనిపించదు కాబట్టి టోపి కలర్‌ఫుల్ వుండాలి. మహిళల చెవులు ఫొటోలో కనిపించాలి. రెండు ఫొటోలు దరఖాస్తుతో ఇవ్వాలి. హజ్ యాత్రకు సంబంధించి రకరకాల ఫొటోలు కాకుండా ఒకే సారి దిగిన ఫొటోలను మాత్రమే ఉపయోగించాలి.

21) క్యాటగిరి ఎంపిక: గ్రీన్, లేదా అజీజియా ఏ క్యాటగిరిలో హజ్ యాత్రికుడు వుండాలనుకుంటున్నాడో జాగ్రత్తగా సెలెక్ట్ చేసుకోవాలి. ఎందుకంటే ఒక సారి క్యాటగిరి సెలెక్ట్ చేసుకున్న తరువాత మార్చుకోవడం సాధ్యం కాదు. (హజ్ 2016 అజీజియా క్యాటగిరికి లక్షా 85 వేలు, గ్రీన్ క్యాటగిరికి 2 లక్షల 19 వేలు చెల్లించారు.) గ్రీన్ 1500 మీటర్‌ల పరిధిలో వుంటుంది. అజీజియా 8 నుంచి 10 కిలో మీటర్ల దూరం వుంటుంది. ఎసి ఫ్రీ బస్‌లు అజీజియా నుంచి హరంషరీఫ్ వరకు తిరుగుతూనే వుంటాయి. గ్రీన్ క్యాటగిరిలో వండుకోవడానికి అవకాశం లేదు. కాబట్టి హజ్ యాత్రికుడు సమీపంలో వున్న హొటల్స్‌లో తినాల్సి వుంటుంది. అజీజియాలో అయితే వండుకొని తినవచ్చు.

22) వసతి సదుపాయం: మక్కాలో గ్రీన్, అజీజియా, మదీనాలో వసతి సదుపాయం మొత్తం కౌన్సిలేట్ జనరల్ చూసుకుంటారు. రూం కెపాసిటీని బట్టి 20 మంది వరకు వుంటారు. అందరూ షేరింగ్‌లో వుండాల్సిందే. 30 మందికి ఒక కిచెన్, రెండు సిలిండర్‌లు, 12 మందికి ఒక టాయెలెట్ వసతి సదుపాయం వుంటుంది.

23) సౌదీ రియాల్: హజ్‌కు వెళ్ళే రోజు ప్రతి యాత్రికుడికి 2 వేల 100 సౌదీ రియాల్ ఇస్తారు. ఆ డబ్బు హజ్ యాత్రికుడు సెంట్రల్ హజ్ కమిటీకి చెల్లించిన దాంట్లో నుంచే తిరిగి ఇస్తారు. ఆ డబ్బుతో మక్కా, మదీనాలో భోజనం చేయడానికి ఉపయోగించుకునే ఉద్దేశంతో ఇస్తారు. ఉదయం 5 రియాల్, మధ్యాహ్నం 10 రియాల్, రాత్రి 10 రియాల్ చొప్పున ఖర్చుపెట్టి మంచి భోజనం తినవచ్చు. అయితే మనం ఇండియాలో తినే ఆహారమే సౌదీలో వుండాలనుకోవడం తప్పు లేదు కాని అది సాధ్యం కాదు.

మీరు ప్రయాణంలో వున్న ముసాఫిర్ అని గుర్తు పెట్టుకోండి. ఏ ప్రాంతంలో ఏమి దొరుకుతుందో అది తినడం అలవాటు చేసుకోండి.

24) పిల్లలకు ఫుల్ టికెట్: రెండేళ్ళ లోపు పిల్లలకు సీటు వుండదు. టికెట్‌లో 10 శాతం చెల్లించాల్సి వుంటుంది. ఇన్‌ఫ్యాంట్ అంటే రెండు సంవత్సరాలలోపు వయస్సు పిల్లలు. రెండేళ్ళలోపు చిన్నారుల వయస్సు అక్టోబర్ 10, 2017 కట్ ఆఫ్ డేట్‌తో సరి చూసుకోవాలి. రెండేళ్ళు దాటిన పిల్లలకు ఫుల్ టికెట్.

25) పేమెంట్ విధానం: పేమెంట్‌లో బ్యాంక్ రిఫరెన్స్ నెంబర్ తప్పని సరి. ఆన్ లైన్‌లో లేదా చలానా పే చేయవచ్చు. డ్రాలో పేరు వచ్చిన తరువాత అడ్వాన్స్‌గా 81, 000 రూపాయలు చెల్లించాలి. మిగతా డబ్బు హజ్ కమిటీ మెసేజ్ ఇస్తుంది. ఆ ప్రకారం చెల్లించాలి. అయితే సౌదీ రియాల్ రేట్‌ను బట్టి ఎంత ఖర్చు అవుతుందో సెంట్రల్ హజ్ కమిటీ నిర్ణయించి ప్రతి హాజీకి మెసేజ్ ఇస్తుంది.

26) డబ్బు జప్తు: తప్పుడు సమాచారంతో, దరఖాస్తులో వాస్తవాలు కాకుండా అబద్దాలు కలిపించి భర్తీ చేయరాదు. కోర్టు నుంచి విదేశాలకు వెళ్ళడానికి అనుమతి లేనప్పుడు, తప్పుడు సమాచారం ఇచ్చినా, డిక్లరేషన్‌లో వాస్తవాలు చెప్పకపోయిన, హజ్ యాత్రికుడు చెల్లించిన డబ్బు జప్తు చేస్తారు. ముఖ్యంగా ఒక సారి హజ్ యాత్ర చేసి ఆ సమాచారం గోప్యంగా వుంచినా, హజ్‌కు వెళ్ళే సమయంలో రిపీటర్ చెల్లించిన మొత్తం డబ్బు, అంతే కాదు అతనితో పాటు వెళ్ళే 70 ఏళ్ళు పైబడిన యాత్రికుడు, లేదా మెహరంగా వెళ్తున్నాడు కాబట్టి ఆ మహిళ డబ్బులు కూడా జప్తు అయిపోతాయి. మొత్తం డబ్బు చెల్లించినంత మాత్రాన హజ్ యాత్రకు వెళ్తారని గ్యారెంటీ లేదు. కోర్టులో కూడా సవాల్ చేయడానికి అవకాశం లేదు.

27) హజ్‌యాత్ర సడన్‌గా రద్దు చేసుకుంటే: తమ ప్రయాణం రద్దు చేసుకోవాలనుకునే హజ్ యాత్రికుడు ఎందుకు రద్దు చేసుకుంటున్నాడో స్పష్టంగా కారణం దరఖాస్తులో రాయాలి. మెడికల్ సర్టిఫికెట్ ఇవ్వాలి. మహిళలకు ప్రెగెన్సీ వున్నా రద్దు చేసుకోవచ్చు. ఇలాంటి మహిళలకు పూర్తి డబ్బులు వాపస్ వస్తాయి.

28) మీనాకు వెళ్ళేటప్పుడు లగేజ్ ఏం పెట్టుకోవాలి: హజ్ సందర్భంగా మీనాలో 5 రోజులు, కొంత మంది ఆరు రోజులుంటారు. మహిళలకు, పురుషులకు వేరే వేరు వసతి. ఒక బెడ్, బ్లాంకెట్, భోజనం సదుపాయం మౌల్లిం ఇస్తాడు. కాబట్టి ప్రతి హాజీ అదనంగా ఒక ఇహ్రామ్‌తో పాటు ఒక డ్రస్, కొన్ని డ్రై ఫ్రూట్స్ తినడానికి పెట్టుకోవాలి. అంతకు మించి లగేజ్ పెట్టుకోరాదు.

29) ఖుర్బానీ: హజ్ యాత్రికుల ఖుర్బానీ నిర్వహించడానికి ఇస్లామిక్ డవలప్ మెంట్ బ్యాంక్ సౌదీ ప్రభుత్వంచే గుర్తించబడిన ఏకైక సంస్థ. అదాయి కూపన్‌ను ఐడిబి ఒక కవర్‌లోని అందరూ యాత్రికులకు కలిపి ఏర్పాటు చేస్తోంది. హజ్ దరఖాస్తులో ఐడిబి ఖుర్బానీ కూపన్ తీసుకుంటామని నిర్ణయించుకున్న తరువాత మళ్ళీ రద్దు చేసుకోవడానికి వీలు వుండదు. పద్ధతి ప్రకారం ఐడిబిఐ టోకెన్ తీసుకోవాలి. అయితే కొంత మంది ఖుర్బానీ డబ్బు మాయ మాటలు చెప్పి దోచుకుంటారు. ఎవడైనా ఖుర్బానీ

చేయడానికి నేను ఏర్పాట్లు చేస్తాను. డబ్బులు ఇవ్వండి టోకెన్ ఇస్తానంటే అలాంటి మోసగాళ్ళతో జాగ్రత్తగా వుండటమే కాదు, వారికి సంబంధించిన సమాచారం మౌల్లింకు అందజేయండి. అలాంటి చీడ పురుగుల్ని సౌదీ ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెడుతుంది. హజ్‌లో ఖుర్బానీ వాజిబ్. మీరే దానికి బాధ్యత వహించాల్సి వుంటుంది.









30) మెడికల్ టెస్ట్: ప్రతి హజ్ యాత్రికుడు తప్పని సరిగా మెడికల్ టెస్ట్‌లు చేయించుకోవాలి. అవసరమైన మందులు డాక్టర్ చిటీతో పాటు పెట్టుకోవాలి. డాక్టర్ సూచించిన మందులు రెండు కిట్‌లు పెట్టుకోండి. 40 రోజులకు సరిపడ మందులు ఒక బాక్స్, మరో బాక్స్‌లో 40 రోజులకు సంబంధించిన మందులు

తప్పని సరిగా పెట్టుకోవాలి. 2015 హజ్ యాత్రలో డాక్టర్ చీటి లేకుండా నిద్రమాత్రలు తీసుకు వచ్చిన హజ్ యాత్రికుడ్ని జిద్దా ఎయిర్‌పోర్ట్ నుంచే నేరుగా జైలుకు పంపి హజ్ తరువాత విడుదల చేశారు.

31) కళ్ళజోడు: కళ్ళ జోడు వాడుతుంటే రెండు మూడు సెట్‌లు పెట్టుకోవాలి.

32) లగేజ్ పోతే: హజ్ యాత్రకు బయలుదేరిన హజ్ యాత్రికుడి బ్యాగేజ్, లగేజ్ మిస్ అయితే దానికి సంబంధించిన ఫిర్యాదు అక్టోబర్ 31, 2017 లోపు రాత పూర్వకంగా చేయాలి. బ్యాగేజ్ పోగొట్టుకుంటే ఇండియన్ ఎంబసీ అధికారులు సెటిల్ చేస్తారు. డాక్యుమెంట్ తప్పని సరి. బ్యాగేజ్ ఎయిర్ పోర్ట్‌లో మిస్ అయితే పిఐఆర్ దరఖాస్తు నింపి ఎయిర్ లైన్స్ వాళ్ళకు ఇవ్వాలి. మక్కా, మదీనాలో మిస్ అయితే మౌల్లిం బాధ్యత వుంటుంది. ఖాదిముల్ హుజ్జాజ్ సహకారం తీసుకొని లగేజ్ తెచ్చుకోవాలి.

33) హాజీ చనిపోతే: మక్కా, మదీనాలో మరణం సంభవించినప్పుడు అక్కడే తత్ఫిన్ చేస్తారు. కౌన్సిలేట్ జనరల్ డెత్ సర్టిఫికెట్ నేరుగా వారి వారసులకు ఇండియా పంపిస్తారు. రోడ్డు ప్రమాదంలో చనిపోతే ఇన్స్యూరెన్స్ కంపెనీ సెంట్రల్ కమిటీ ద్వారా పరిహారం చెల్లిస్తుంది.

33) ఐదు లీటర్ల జంజం: హజ్ యాత్రికుడు తిరిగి వచ్చేటప్పుడు 5 లీటర్ల జం జం బాటిల్‌ను హాజీకి ఇండియాలోని ఎయిర్‌పోర్ట్‌లో (స్థానిక ఎయిర్ పోర్ట్‌లో) దిగిన తరువాత ఇస్తారు.

34) నిషేధించిన వస్తువులు: సౌదీ ప్రభుత్వం నిషేధించిన వస్తువులు తీసుకొని వెళ్ళరాదు. సెంట్రల్ హజ్ కమిటీ ప్రచురించిన గైడ్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు స్పష్టంగా వున్నాయి. మరిన్ని వివరాలకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ హజ్ కమిటీ టోల్ ఫ్రీ నెంబర్ 18004257873కు సంప్రదించింది.

# తెలుసుకోవాల్సిన అరబీ పదాలు

| | | | |
|---|---|---|---|
| ఒకటి | వాహిద్ | రెస్టారెంట్ | మతామ్ |
| రెండు | ఇస్ నైన్ | చెక్కెర | సుక్కర్ |
| మూడు | తలాత | తేనె | అస్ల్ |
| నాలుగు | అర్బా | మాంసం | లహమ్ |
| ఐదు | ఖమ్‌స | నాకు తెలియదు | అన మాఫి మాలూమ్ |
| ఆరు | సిత్తా | నేను | అన |
| ఏడు | సబ్‌అ | ఇది | హాజా |
| ఎనిమిది | తమానియ | ఇక్కడ | హినా |
| తొమ్మిది | తిస్‌ఆ | నీవు | అంత |
| పది | అష్రా | అతను | హువ |

# హజ్ ఉమ్రాలకు ముందు చేయవలసిన పనులు

హజ్ యాత్ర ఎన్నో శారీరక, మానసిక ఇబ్బందులతో కూడుకున్న ప్రయాణం. అందుకు చాలా సహనం, ఓపిక అవసరం. ప్రతి రోజు కనీసం ఓ గంట సేపు త్వరత్వరగా నడవడం అలవాటు చేసుకోండి. మీ నమాజ్ చక్కదిద్దుకోండి. నమాజ్‌లో, హజ్‌లో పఠించవలసిన దువాలను కంఠస్తం చేసుకోండి.

మెడికల్ చెకప్ చేయించుకొని అవసరమైన మందులు క్రమం తప్పకుండా వాడండి. లిఫ్ట్, ఎస్కలేటర్ ఉపయోగించడం తెలుసుకోవాలి. మీరు రోజు తినే ఆహారం కాకుండా సౌదీలో తినడానికి మీరు ప్లాన్ చేసుకున్న ఆహారాన్ని ఇప్పట్టినుంచే అలవాటుచేసుకోండి. హజ్ క్యాంప్‌లకు వెళ్ళి మీ అనుమానాలన్నీ తీర్చుకొని ఫిట్‌గా వుండండి. తీసుకువెళ్ళాల్సిన అవసరమైన బట్టలు, వంటసామాగ్రి తదితర వస్తువుల జాబితా సిద్ధం చేసుకోండి.

హజ్ చేయదలచిన వ్యక్తి ఇతరుల డబ్బును ఆశించకూడదు. డబ్బు ఇతరుల నుంచి తీసుకొని హజ్ చేయరాదని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించారు. తన కున్న సొంత డబ్బుతోనే హజ్ యాత్ర చేయాలి. ఉన్నంతలోనే సర్దుకునేవానికి అల్లాహ్ తోడ్పడతాడు. పరుల డబ్బు ఆశించని వ్యక్తికి ధనభాగ్యం, దైవం నుంచి శుభం కలుగుతుంది. అలా కాకుండా ప్రజల వద్ద డబ్బు అడిగేవాడు ప్రళయదినాన అతని ముఖంపై మాంసం కండ లేకుండా భయంకరంగా ప్రత్యక్షం అవుతాడు. హజ్, ఉమ్రా నిర్వహించుటకు తన హలాల్ సంపాదన మాత్రమే ఉపయోగించాలి. దైవప్రవక్త ఇలా తెలిపారు.

హలాల్ సంపాదనతో మానవుడు హజ్ కొరకు బయలు దేరునప్పుడు లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్ అని హజ్ యాత్రికుడు పలికినప్పుడు ఆకాశం నుంచి జవాబుగా ఈ అరుపులు ప్రతిధ్వనిస్తాయి. లబ్బైక్ వ సఅదైక్ (చిత్తము, సౌభాగ్యం) నీ దారి భత్యం స్వచ్ఛమైనది. నీ ప్రయాణ ఖర్చు స్వచ్ఛమైనది. నీ హజ్ పవిత్రమైనది. పాపభారానికి దూరంగా వుంది. ఒక వేళ పాపపు డబ్బుతో హజ్‌కు బయలుదేరితే లబ్బైక్ అల్లాహుమ్మ అని పలికినప్పుడు ఆకాశం నుంచి జవాబుగా ఈ అరుపులు ప్రతిధ్వనిస్తాయి. లబ్బైక్ వలాసాదైక్ (వద్దే వద్దు, నీరాక శుభము కాదు) నీ దారి భత్యం పాపపు సొమ్ముతో కూడి ఉంది. నీ దారి ఖర్చులు తప్పుడివే. నీ హజ్ అశుభం.

**ఎ.పి.హజ్‌బులెటిన్ చదవాలనుకుంటున్నారా?**

***వెంటనే చందాదారులుగా చేరండి. హజ్-ఉమ్రా విధివిధానాలను ఖురాన్ హదీస్‌ల ఆధారంగా ఇస్లామిక్ స్కాలర్స్ ఆధ్వర్యంలో "ఎ.పి.హజ్‌బులెటిన్"ను ఎపి హజ్ కమిటీ ప్రచురిస్తోంది. చందా వివరాలు విడి ప్రతి రూ.15/- సంవత్సర చందా రూ.85/- చందా మొత్తాన్ని ఎం.ఓ. లేక డి.డి. ద్వారా పంపవచ్చు. డి.డి. ద్వారా పంపదలిస్తే ఇ.వో. ఎపి స్టేట్ హజ్ కమిటీ, అకౌంట్ నెంబర్: 01023334 కార్పోరేషన్ బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ విజయవాడ.***

**హజ్‌బులెటిన్‌లో ప్రచురించడానికి ఇస్లామిక్ పండితుల నుంచి వ్యాసాల్ని ఆహ్వానిస్తున్నాం.**

ప్రతి నెల విడుదలౌతున్న హజ్‌బులెటిన్‌లో ప్రచురించడానికి ఇస్లామిక్ స్కాలర్స్ నుంచి హజ్, ఖురాన్, హదీస్‌కు సంబంధించిన ఆర్టికల్స్ (తెలుగు-ఉర్దూ భాషలో టిడిపి చేయించి ఓపెన్ ఫైల్ aphajjpro@gmail.comకు మెయిల్ చేయాలి).

**ప్రింట్‌అవుట్‌కానీ, రాతప్రతినికాని పంపరాదు.** ప్రచురించిన వ్యాసానికి తగిన హదియా ఇస్తాం.

# మహా ప్రవక్త ఇబ్రాహీం

కర్రి మబ్బుల కరాళనృత్యానికి విసుగు చెందిన మానవాళికి ఆయనో ఉదయ కిరణం. అసత్య అంధకారాలను రూపుమాపి వెలుగుల్ని నింపిన ధర్మతేజం. మార్గభ్రష్టత్వంలో మగ్గే హృదయాలను ప్రక్షాళనంగావించిన పరమ ఆదర్శం ఆయన జీవితం. చైతన్యాన్ని జ్వలింపజేసే సత్తువ, మనస్సులను కదిలించే ప్రేరణ, హృదయాల్ని ఏలే శక్తి త్యాగానికి మాత్రమే ఉంటుందనడానికి ఆయన నడవడికే ప్రబల తార్కాణం. దు:ఖరూపం ఆయన. యుగయుగాలుగా నిద్రాణంలో ఉన్న ప్రజలను చైతన్యపరిచి సత్యమార్గంలో నడిపించిన అపురూప రథసారధులందరికీ మూల పురుషుడు ఆయన. తన అస్తిత్వం రీత్యా ఆయన ఒక మనిషి మాత్రమే. కాని తన అసాధారణ త్యాగాల దృష్ట్యా, ఘనకార్యాల రీత్యా ఆయన ఓ సమాజం! ఓ గొప్ప అకాడమి!ఈ కారణంగానే ప్రవక్తల పితామహునిగా నేటికీ యూద, క్రైస్తవ, ముస్లిం సముదాయాల హృదయాల్లో సమానంగా చిరస్మరణీయులయ్యారు. ఈ ఘనతా విశిష్టతల మూలంగానే అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు.

'ఇది ఇబ్రాహీం(అ) గాథ. శుద్ధ అవివేకి మాత్రమే ఇబ్రాహీమ్ పాటించిన జీవన సరళి పట్ల వైముఖ్యం చూపగలడు. మేము అతన్ని ప్రపంచంలోనూ ఎన్నుకున్నాము. పరలోకంలో కూడా అతను సజ్జనుల సరసన ఉంటాడు." (బఖర : 130)

ఈ ఎంపిక ఏ ఆధారంగా జరిగిందంటారా?

'నిన్ను నీవు (నాకు) సమర్పించుకో' అని అతని ప్రభువు అతన్ని ఆదేశించినప్పుడల్లా 'సకల లోకాల ప్రభువుకు నన్ను నేను సమర్పించుకున్నాను'అని అతను సమాధానం ఇచ్చాడు." (బఖర : 131)

ప్రవక్త ఇబ్రాహీం(అ) యూదుడు కాడు. క్రైస్తవుడూ కాడు. వాస్తవంగా ఆయన ఏకాగ్రత గల ముస్లిం మాత్రమే. ఆయన ప్రజలను యూదత్వం వైపుకో, క్రైస్తవం వైపుకో ఆహ్వానించలేదు. అప్పటికి ఈ మతాల జాడే లేదు. ఆయన ప్రబోధించింది ఏకేశ్వరోపాసన (తౌహీద్)ను మాత్రమే. దాసుడు దేవుని ఆదేశాలకు శిరసావహించడం గురించే ఆయన నొక్కి వక్కాణించారు తప్ప బహుదైవత్వం గురించి కాదు. విధేయతా మార్గమే, ఆ శాంతికి బాటయే ఇస్లాం. ఆ మాటకొస్తే ప్రవక్తలందరి ధర్మం కూడా ఇస్లామే. వారందరూ ముస్లిములే. ఈ విషయాలన్నీ మహనీయ ముహమ్మద్(స) ఈవిధంగా ప్రవచించారు: 'ప్రవక్తల సమూహం సవతి సంతానం వంటిది. వారి తల్లులు వేరు, కాని వారి ధర్మం మాత్రం ఒక్కటే." (బుఖారీ)

"ఇన్నద్దీన ఇన్‌దల్లాహిల్‌ఇస్లాం'- అల్లాహ్ వద్ద ఆమోదయోగ్యమైన ధర్మం ఇస్లాం మాత్రమే.' (ఆలిఇమ్రాన్ : 19)

ఇస్లాం వారసత్వంగా వచ్చే మతం కాదు

ధనం, ఐశ్వర్యం, పొలం వారసత్వంగా లభించవచ్చేమోగాని, ఇస్లాం మాత్రం వారసత్వంగా లభించేది కాదు. దాన్ని మనిషి అన్వేషించి, శోధించి, సాధించుకోవాలి. అధికశాతం మంది ప్రవక్తలు అవిశ్వాసుల ఇంట, బహుదైవారాధన సమాజంలోనే జన్మించారు. వారిలో ప్రవక్త ఇబ్రాహీమ్(అ) ఒకరు. అయితే ఆయన తత్వం వేరు. ప్రతి విషయాన్ని నిశిత దృష్టితో తరచి చూడటం ఆయనకు అలవాటు. మనిషి స్వహస్తాలతో చేసిన ప్రతిమల ముందు మోకరిల్లడం, అలౌకికానందంతో హారతులు పట్టడం, భక్తిపారవశ్యాలతో చేతులు జోడించడం ఆయనకు మింగుడుపడలేదు. తనపై వాలే ఈగను సైతం తోలుకోలేని విగ్రహాల ముందు మొక్కుబడులు, ముడుపులు చెల్లించుకోవడం, ఆయనకు హాస్యాస్పదంగా తోచింది. అగ్రవర్ణం, అధమ

వర్ణం అంటూ అంటరానితనాన్ని, అస్పృశ్యతలనే విషగుళికల్ని చల్లి దళిత జనాల శ్రమను సొమ్ము చేసుకుంటూ, వారి చెమటను సంపదగా మార్చుకుంటూ వారికి అన్ని విధాలా అణిచివేయడం ఆయనకు నచ్చ లేదు. రాజ్యాధికారులు తమని తాము దైవాంశ సంభూతులుగా ప్రకటించుకొని, ప్రజలందరూ తమకే తలవంచేలా చట్టాల్ని సవరించుకొని నియంతృత్వాన్ని, నిరంకుశత్వాన్ని కొనసాగించడం ఆయనకు జీర్ణం కాలేదు.

ఒక్కమాటలో చెప్పాలంటే తన తండ్రిలాంటి అనేకులు పీఠాధిపతులుగా చెలామణి అవుతూ సమాజాన్ని రోగగ్రస్తంగా మార్చేయడం ఆయనకు బొత్తిగా నచ్చలేదు. మనిషి మూఢనమ్మకాల లోయల్లో పడి లేవలేని స్థితిలో ఉండటం గమనించిన ఆయన చలించిపోయారు. సత్యశోధన చేశారు. సత్యాన్వేషణ జరిపారు. సత్యాన్ని వేడుకున్నారు, స్వీకరించారు. అమలుపర్చారు. అదే ప్రజలకు ప్రబోధించారు. తన జీవిక కోసం తోడ్పడే సూర్య చంద్ర నక్షత్రాలను కాక, ఆ ఏర్పాట్లు చేసిన సర్వేశ్వరుని ముందు తలవంచడమే వీటన్నింటికీ ఏకైక పరిష్కారంగా ఆయన తలిచారు. ప్రజలను సృష్టితాల దాస్యం నుండి విడిపించి సృష్టికర్త దాస్యంలో ఓలలాడేలా చెయ్యాలనుకున్నారు. ఈ మార్గంలోనే ఆయన అహర్నిశలు పరిశ్రమించారు కూడా.

దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే- మనం ముస్లింల ఇంట పుట్టామా, అవిశ్వాసుల ఇంట పుట్టామా అన్నది ఇక్కడ చర్చనీయాంశం కానేకాదు. ఎందుకంటే పుట్టుక, మరణాలు మన చేతిలో లేవు కాబట్టి. కాకపోతే ఈ రెండింటికి మధ్యనున్న కాలం ఎలా జీవించాలి? విశ్వాస స్థితిలో మరణించాలా, అవిశ్వాస స్థితిలో కళ్ళు మూయాలా? ఇది మాత్రం మనమే నిర్ణయించుకోవాలి. అవిశ్వాసుల ఇంట జన్మించడం మన తప్పుకాదు. అందుకు మనం చింతించాల్సిన అవసరమూ లేదు. అయితే అవిశ్వాసులుగానే మరణించడం, సత్యం ఇదని తెలిసి కూడా మారకపోవడం ఖచ్చితంగా మన తప్పే అవుతుంది. తర్వాత తీరిగ్గా కూర్చుని చింతించినా ఫలితం మాత్రం ఉండదు. అలాగే మనం విశ్వాసుల ఇంట జన్మించినందుకు ఉబ్బితబ్బిబ్బవ్వాల్సిన అవసరం లేదు. ప్రవక్తల కడుపున పుట్టినవారు కూడా తమ వెకిలిచేష్టల మూలంగా నరకవాసుల జాబితాలో చేరిపోయారు. కాబట్టి ఎక్కడ పుట్టామా అన్నది కాదు ముఖ్యం. సత్యమార్గంలో జీవించామా అన్నదే ముఖ్యం. ఇదే విషయాన్ని ప్రవక్త ఇబ్రాహీం, ప్రవక్త యాకూబ్(అ) తమ సంతానానికి బోధించారు.

“ఈ ఉపదేశమే ఇబ్రాహీమ్, యాకూబ్ తమ సంతానానికి చేశారు. వారిలా అన్నారు : “నా బిడ్డలారా! అల్లాహ్ మీ కోసం ఈ (శాంతి విధేయతల) ధర్మాన్నే ఇష్టపడ్డాడు. కనుక మేము ముస్లింలుగా తప్ప మరణించకూడదు సుమా! (మీకు విశ్వాస స్థితిలోనే మరణం రావాలి సుమా!) (బఖర : 132)

దేవుని కటాక్షంలోనే సన్మార్గ భాగ్యం

అవును, మనిషిలో సత్యార్తి రగలాలి. మనిషి సత్యాన్వేషిగా మారాలి. అజ్ఞానం, దీనత్వం, భావదారిద్ర్య సంకెళ్ళను తెంచే జ్ఞానవంతుడిగా, విజ్ఞానవంతుడిగా, ధీరుడిగా ఎదగాలి. అప్పుడే మనిషిలోని ప్రజ్ఞాపాటవాలు వెలుగుచూస్తాయి. అప్పుడే దైవ కటాక్షం తోడై సన్మార్గ భాగ్యం లభిస్తుంది. మనిషి జీవిత లక్ష్యం సిద్ధిస్తుంది. ఈ సృష్టి, సృష్టిలో సమస్తమూ అల్లాహ్‌దే. చూసేందుకు చర్మ చక్షువులతోపాటు ఆత్మచక్షు లుండాలేగాని కానవచ్చే కథలెన్నో! వినవచ్చే పాఠాలు, గుణపాఠాలెన్నో!! అర్థం చేసుకునేందుకు మెదడుతోపాటు ఆస్వాదించే మనసుండాలేగాని సత్యోపదేశ జలధారలు అమృత కలశాలెన్నో!! అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు : “నమ్మే వారికి భూమిలో పలు నిదర్శనాలున్నాయి. స్వయంగా మీ ఆత్మలలో (అస్తిత్వంలో) కూడా (ఎన్నో నిదర్శనాలు) ఉన్నాయి. మరి మీరు పరిశీలనగా చూడటం లేదా?” (జారియాత్ : 20,21)

నేడు అన్ని రంగాలల్లో విజయ కేతనాల్ని ఎగురవేస్తున్న మానవుడు శాస్త్రవేత్తగా, ఆర్థికవేత్తగా సన్మానాలందుకుంటున్న మానవుడు దైవాన్ని



లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్ లబ్బైక్ లా షరీక లక లబ్బైక్ ఇన్నల్ హమ్‌ద వన్నిమత లక వల్ ముల్క్ లా షరీక లక

తెలుసుకోలేకపోతున్నాడు. కారణం పదార్థ పూజ, తన మేధ చెప్పింది, తన ఇంద్రియాల పరిధిలో వచ్చిందే సత్యం, తక్కినవన్నీ మిథ్యా అన్న అహం. ఫలితం మామూలు సగటు మనిషి దైవాన్ని గుర్తించగలుగుతున్నా డిగ్రీలు, పట్టాలు పుచ్చుకున్నవారు మాత్రం ఈ భాగ్యాన్ని దూరంగా ఉంటున్నారు. అడగనిదే అమ్మ కూడా పెట్టదు' అన్నట్టు మనిషిలో సత్యార్తి లేనిదే అల్లాహ్ కూడా అతనికి సన్మార్గం చూపడు. ఏ సూర్యచంద్ర నక్షత్రాల పరిశోధనతో నేటి మానవుడు ప్రగతి అంచులను తాకుతున్నాడో, ఒకప్పుడు అవే సూర్యచంద్ర నక్షత్రాలను చూసి వాటిని రూపకల్పన చేసిన అల్లాహ్‌ను కనుగొన్నారు ప్రవక్త ఇబ్రాహీమ్(అ). జ్ఞానోదయం అనంతరం ఆయన ఇలా ప్రకటించారు :

"ఓ నా జాతివారలారా! దేవునికి మీరు కల్పించే భాగస్వామ్యాలతో నేను విసుగెత్తిపోయాను. వాటితో నాకెలాంటి సంబంధంలేదు' అని ప్రకటించారు. (అన్ఆమ్ : 78)

"నిశ్చయంగా నేను ఆకాశాలను, భూమిని సృష్టించిన ఆ సృజనశీలుని వైపునకు ఏకాగ్రతతో నా ముఖాన్ని తిప్పుకుంటున్నాను. నేను షిర్క్ (బహు దైవారాధన) చేసే వారిలోని వాణ్ణి మాత్రం కాను." (అన్ఆమ్ : 79)

దీక్ష, కృషి ఉంటే సమాజంలో మార్పు సాధ్యమే

సంఘ సంస్కరణ రంగానికి మూల పురుషులు ప్రవక్తలు. అంధ విశ్వాసాలు, మూఢనమ్మకాలు, దౌష్ట్యాలు, దౌర్జన్యాలపై తిరుగుబాటును ప్రకటించిన ఆద్యులు ప్రవక్తలు. మాయామబ్బులు కమ్మి, మార్గం కానరాక అయోమయావస్థలో పడి కొట్టుమిట్టాడే జనవాహినికి సత్యవెలుగుల్ని ప్రసాదించిన కాంతికారులు ప్రవక్తలు. సృష్టితాల దాస్య శృంఖలాలను త్రెంచి సృష్టికర్తను ఆరాధించమని పిలుపు ఇచ్చిన పుణ్య శ్రేయోభిలాషుల సంఖ్య 1లక్ష 24వేల మంది కాగా, వారిలో 315 మంది రసూల్ (దైవదౌత్యంతోపాటు ధర్మశాస్త్రం అనుగ్రహించబడిన ప్రవక్తలు) అనగా, వారిలో ఐదుమంది వజ్ర సంకల్పం గల ప్రవక్తలు. 1) ప్రవక్త నూహ్- తన జాతివారిని 950 సంవత్సరాలు సత్యధర్మంవైపు పిలుస్తూనే ఉన్నారు 2) ప్రవక్త ఇబ్రాహీం(అ), ఎన్ని అడ్డంకులు ఎదురయినా, ఎన్ని ప్రతికూల పవనాలు వీచినా, నిప్పుల్లో నెట్టేసినా, ఊరి నుండి వెలి వేసినా ఆయన మాత్రం ప్రజల మేలును కోరుతూ ప్రభువు మార్గం వైపు వారిని ఆహ్వానిస్తూనే ఉన్నారు. 3) ప్రవక్త మూసా(అ) అగ్రవర్ణం అని చెప్పుకుని బీరాలు పోయే ఖిబ్తీలు, ఆమెవాలు, మిష్కీయులు కృషీవలుల్ని బానినలుగా చేసే నిరంకుశ పాలనాధికారులపై యుద్ధాన్ని ప్రకటించిన ధీరోదాత్తులు 4) ప్రవక్త ఈసా (అ)- ప్రజలు ఆయన్ను హింసించినా, చెరసాలలో బంధించినా, పారదర్శకతనే ప్రధానంగా భావించి వారిని ప్రభువు మార్గంలో నడిపించేందుకు పట్టు వదలని విక్రమార్కుడిలా పరిభ్రమించారు. 5) అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) గత ప్రవక్తలందరి కాలాల్లో ఉన్న దౌర్జన్యాలన్నీ ఆయన ఒక్కరి హయాంలో ఉన్నా విసుగు చెందక ఎంతో ఓర్పుతో, నేర్పుతో ప్రజల్లో సత్య చైతన్యాన్ని తీసుకువచ్చి గొప్ప ఆదర్శ సమాజాన్ని స్థాపించారు. కాబట్టి ఈ దారి ప్రవక్తలందరూ నడిచిన దారియే. ఇది కొత్త ఎంత మాత్రం కాదు. చీకటి ఇంత దట్టంగా ఉందే అని భయపడటం మాని ఒక్క దీపం వెలిగించండి. చీకటి దానంతట అదే తొలిగిపోతుంది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

'వజ్ర సంకల్పం గల ప్రవక్తలు సహనం వహించినట్లు నీవూ సహనం వహించు, వారి విషయంలో తొందర పెట్టకు." (అహ్ఖాఫ్ : 35)

ఈ జీవన పయనంలో విజయంతోపాటు వైఫల్యాలూ ఉన్నాయి. ఆశా భంగాలూ ఉన్నాయి. కాని దారి తప్పిన ప్రతిసారి ప్రవక్తల జీవితాలు మనకు మార్గదర్శకం కావాలి. ఖుర్ఆన్ మనకు వెలుగుబాటగా నిలవాలి. గమ్యం చేరుకోవాలన్న దీక్షగల బాటసారి అలుపెరగడన్న వాస్తవాన్ని తెలుసుకోవాలి. ఈ కార్యసిద్ధికై దీక్ష, దుఆలతోపాటు అల్లాహ్‌పై ప్రగాఢమైన విశ్వాసం

ఉంచాలి. లక్ష్యం ఛేదించగలమనే సాహసంతోపాటు లోపాలను సరిదిద్దుకునే గుణం అలవడాలి. సజ్జనుల సాంగత్యం కోసం అలవాటుపడాలి. నిత్యం శోభాత్మల్ని అన్వేషిస్తూ ఉండాలి. అంతర్గత శక్తుల్ని సరిగ్గా అంచనా వేయగలగటం, జ్ఞానాభివృద్ధి కోసం అవసరమైన మార్గాన్ని అవలంభించడం అనేవి తప్పనిసరి విషయాలు. మౌలానా మౌదూది (రహ్మ)గారు ఇలా ఉపదేశించారు:

'మీలోని ప్రతి ఒక్కరి అంతరంగంలో 'జ్వాల' అనేది ప్రజ్వలిస్తూనే ఉండాలి. ఆ జ్వాల అనారోగ్యంతో విలవిల్లాడే కుమారుణ్ని చూసి వైద్యుడి వద్దకు తీసుకెళ్ళేంత వరకు మీ హృదయాలలో మండుతూ ఉండే ప్రేమ జ్వాలలా, ఓ జ్వాల ప్రజల్ని వారి ప్రభువుని అప్పగించేంత వరకూ మీలో మండుతూనే ఉండాలి!!

(గీటురాయి సౌజన్యంతో)

# హజ్ ప్రయోజనాలు, ప్రాముఖ్యత

## హజ్ యాత్ర ఎప్పట్టి నుంచి ప్రారంభం అయింది?

మొదటి మానవుడు, ప్రవక్త హజ్రత్ ఆదాం(అలై) హయాంలోనే హజ్ యాత్ర ప్రారంభం అయింది. అల్లా ఆదేశం మేరకు హజ్రత్ ఆదాం(అలై) ఇండియా నుంచి మక్కా నగరానికి వెళ్ళి దైవదూతల సహాయంతో బైతుల్లాషరీఫ్ (కాబాగృహం) పునాది వేశారు. ఆ తరువాత హజ్ చేశారు. ఇలా ప్రారంభం అయింది హజ్ యాత్ర. ఆ తరువాత 300 మంది హజ్ యాత్ర కోసం, మరో 700 మంది ఉమ్రా కొరకు మక్కా నగరాన్ని సందర్శించారు.

హజ్రత్ అబూహురేరా(రజి) హదీస్ ప్రకారం ముహమ్మద్ ప్రవక్త హజ్‌యాత్ర గురించి ఇలా తెలిపారు... హజ్రత్ ఆదాం(అలై) జన్నత్ నుంచి భూమిపైకి దిగిన తరువాత కాబా చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేశారు. ప్రస్తుతం ముఖామే ఇబ్రాహీం వున్న స్థలంలో రెండు రకాత్‌ల నమాజ్ చదివారు. ఆ తరువాత దువా చేశారు. యా అల్లా నీవు నా మనస్సులోవున్న, బయట కనిపించే అంశాలన్నీ నీకు తెలును. నీవు నా దువాను అంగీకరించు. నా అవసరాలన్నీ తెలిసినవాడివి. నా చెడు కోరికల్ని మన్నించు. అయ్ అల్లా నీతో వేడుకుంటున్నాను. నా ఈమాన్ కాపాడు. సచ్ఛిలత, నిజాయితీ, మంచి నడవడికగల వ్యక్తిగా తీర్చిదిద్దు. అల్లా నీవు ఏది అనుకుంటే అదే జరుగుతుంది.

హజ్రత్ ఆదాం(అలై) దువా చేసిన తరువాత అల్లా తరపున వహీ వచ్చింది. "అయ్ ఆదాం....నేను నీ తప్పుల్ని క్షమించాను. నీ సంతానం కాబా గృహానికి వచ్చి ఈ దువా చేస్తే వారి తప్పుల్ని మనిస్తాను".

మరో హదీస్ ప్రకారం హజ్రత్ ఆదాం(అలై) హజ్ చేసిన తరువాత దైవదూతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గత రెండు వేల సంవత్సరాలుగా తాము కూడా ఇలానే హజ్ యాత్ర చేస్తున్నట్లు దైవదూతలు హజ్రత్ ఆదాం(అలై)కు తెలిపారు.

అప్పుడు హజ్రత్ ఆదాం(అలై) దైవదూతల్ని ఇలా ప్రశ్నించారు. మీరు కాబా ప్రదక్షణ చేసేటప్పుడు ఏ దువా చదివేవారు?

దైవదూతలు ఇలా సమాధానమిచ్చారు.

"సుబ్‌హానల్లాహి,

వల్ హందు లిల్లాహి,

వలా ఇలాహ

ఇల్లల్లాహు వల్లాహు అక్బర్"

ఆ తరువాత హజ్రత్ ఆదాం(అలై) కూడా ఇదే దువా పఠించారు.

# సయ్యదన హజ్రత్ ఇబ్రాహీం ఖలీలుల్లా(అలై) హజ్ ప్రకటన

సయ్యదన హజ్రత్ ఇబ్రాహీం ఖలీలుల్లా(అలై) అల్లాహ్ ఆజ్ఞ ప్రకారం బైతుల్లాషరీఫ్ పునర్నిర్మాణం చేపట్టారు. నిర్మాణం పూర్తి అయిన తరువాత అల్లా నుంచి ఆదేశం వచ్చింది. అయ్ ఇబ్రాహీం నీవు ప్రజల్లో హజ్ యాత్ర గురించి ప్రకటించు.

అప్పుడు హజ్రత్ ఇబ్రాహీం ఖలీలుల్లా(అలై) అల్లాను ఇలా వేడుకున్నారు. అయ్ అల్లా ఈ కొండ లోయల్లో నా పిలుపు ఎంత వరకు వెళుతుంది?

మళ్ళీ అల్లాహ్ నుంచి సమాధానం (ఆకాశం నుంచి ప్రతిధ్వనిస్తుంది. నీ పని ప్రకటించడం మాత్రమే. ప్రజల వరకు చేర్చే బాధ్యత నాది.

ఇబ్రాహీం ఖలీలుల్లా(అలై) అల్లా ఆదేశాన్ని పాటిస్తూ ఓ కొండపై ఎక్కి పిలుపునిచ్చారు. "ఓ ప్రజలారా! మీ సృష్టికర్త ఆయన గృహాన్ని నిర్మించాడు. కాబా గృహాన్ని సందర్శించి హజ్‌యాత్ర చేయండి"

ఇబ్రాహీం ఖలీలుల్లా(అలై) నోటి నుంచి వెలువడిన హజ్ ప్రకటనను కేవలం ఆ పరిసరాలు, చుట్టుపక్కల వారే కాదు తల్లి కడుపుల్లో వున్న పిండం, తండ్రి వెన్నుముకలో వున్న వారికి సైతం సమాచారాన్ని ఆ సృష్టికర్త చేరవేశాడు. ఆ సమయంలో లబ్బైక్ అని ఎన్నిసార్లు అన్నారో వారికి అన్నిసార్లు బైతుల్లాను సందర్శించే భాగ్యం కలుగుతుంది.

## హజ్ ప్రాధాన్యత

ఇస్లాంలో హజ్ యాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉంది. 9వ హిజ్రీలో హజ్ ఫర్జ్ అయింది. ఖుర్‌ఆన్‌లో అల్లా ఇలా ఆదేశిస్తున్నాడు: "హజ్ అల్లా యొక్క హక్కుగా ప్రజలపై చేయబడింది. హజ్ విధిని నెరవేర్చడం ప్రజల బాధ్యత. దీన్ని విధిగా నేరవేర్చాలి.

## జీవితంలో ఒకే సారి హజ్

జీవితంలో ఒకే సారి హజ్ చేయడం విధిగా చేయబడింది. నఫిల్ హజ్‌లకు అంత ప్రాధాన్యత లేదు. హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్(రజి) హదీస్ ప్రకారం ఒకసారి ప్రవక్త ప్రవక్త ముహమ్మద్(స) సహాబీలకు ఇలా చెప్పారు. "అల్లాహ్ హజ్‌ను ప్రజలపై విధిగా చేశారు."

అప్పుడు ఓ సహాబీ ప్రవక్త ప్రవక్త ముహమ్మద్(స)తో తన అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఓ ప్రవక్త నేను ప్రతి ఏడాది హజ్ యాత్రకు విధిగా వెళ్ళాలా?

అప్పుడు ప్రవక్త ముహమ్మద్(స) ఇలా అన్నారు. నేను అవును అని ఉంటే నా ఉమ్మత్‌పై ప్రతి ఏడాది హజ్ ఫర్జ్ అయ్యేది. నీవు కూడా ప్రతి ఏడాది ఈ విధిని అమలు చేయలేకపోయే వాడివి. హజ్ కేవలం ఒక సారి మాత్రమే ఫర్జ్. మిగతా ఎన్ని సార్లు చేసిన అది నఫిల్ కిందకే వస్తుందని ప్రవక్త ముహమ్మద్(స) స్పష్టంగా వివరణ ఇచ్చారు.

హజ్ చేసే స్థోమత ఉంటే వెంటనే నెరవేర్చండి

ఎవరిపైన హజ్ విధి అయిందో వారు వెంటనే హజ్ విధిని నెరవేర్చాలి. హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) హదీస్ ప్రకారం ప్రవక్త ముహమ్మద్(స) ఇలా అన్నారు.

"ఆరోగ్యంగా, ఆర్థికంగా మీకు హజ్ చేసే అర్హత వుంటే వెంటనే హజ్ యాత్రకు నిర్ణయం తీసుకోండి. ఎందుకంటే భవిష్యత్‌లో ఏం జరుగుతుందో!

మరో హదీస్‌లో ప్రవక్త ముహమ్మద్(స) ఇలా అన్నారు. ఎవరు హజ్ యాత్ర చేయాలని నిర్ణయించుకుంటారో వెంటనే సిద్ధం కాండి. ఎందుకంటే డబ్బు ఖర్చు అయిపోవచ్చు. లేదా ఆరోగ్యం సహకరించకపోవచ్చు. పిల్లల పెళ్ళి చేసి హజ్ యాత్రకు వెళ్ళానుకోవడం సరికాదు. కాబట్టి వెంటనే హజ్ నిర్ణయం తీసుకోండి.

## హజ్‌పై అభిప్రాయాలు

హజ్ యాత్రపై ఎవరి ఇష్టం వచ్చిననట్లు వారు అభిప్రాయాలు పెట్టుకుంటారు. ఉదాహరణకు తండ్రి

పేదరికంలో వుంటారు. ఆ తరువాత కుమారుడు బాగా సంపాదిస్తాడు. ముందు తన తండ్రిని హజ్ యాత్రకు పంపిన తరువాతే తాను హజ్ యాత్రకు వెళ్ళాలనుకోవడం కరెక్ట్ కాదు. హజ్ చేయాలంటే దేవుడు ఎవరికి ఆర్థిక స్థోమత ఇస్తే వారే చేయాలి. అంతే కాని తండ్రి చేయాలి ఆ తరువాత కుమారుడు అనే లెక్కలు పెట్టుకోరాదు. డబ్బు వుండి కూడా హజ్ యాత్రకు వెళ్ళకపోతే అల్లాకు సమాధానం చెప్పాల్సి వుంటుంది.

సయ్యదన హజ్రత్ అలీ(ర) హదీస్ ప్రకారం ప్రవక్త ప్రవక్త ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు. ఆర్థిక స్థోమత వున్న వ్యక్తి యహూదీ, నస్రానీ, ఇసాయీ లా చనిపోకుండా వెంటేనే హజ్ విధిని నెరవేర్చాలన్నారు.

### పాపాల నుంచి బయటపడే మార్గం హజ్

తాము చేసిన పాపాల్ని క్షమించమని వేడుకోవడానికి హజ్ అరుదైన అవకాశం. దేవుడి ముందు తమను తాము హాజరుపర్చుకొని శరణు వేడుకోవడానికి హజ్ అవకాశం కల్పిస్తుంది. హజ్రత్ అబూహురేరా(రజి) హదీస్ ప్రకారం ప్రవక్త ప్రవక్త ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు. హజ్ యాత్ర ఇలా చేయాలి. అందులో పాపం, అనవసరమైన మాటలు, ఇతరుల్ని ఇబ్బంది కల్గించడం లాంటివి చేయకపోతే పాపాల నుంచి ఇలా పవిత్రుడౌతాడు. తల్లి కడుపులోంచి అప్పుడే పుట్టిన బిడ్డలా హాజీ పవిత్రుడు అవుతాడు. జీవితంలో చేసిన తప్పులు, పాపాల నుంచి పవిత్రుడు అవ్వడానికి హజ్ అవకాశం కల్పిస్తోంది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (రజి) హదీస్ ప్రకారం ప్రవక్త ముహమ్మద్(స) ఇలా ఉల్లేకించారు. హజ్-ఉమ్రా విధిని పూర్తి చేయండి. ఎందుకంటే బట్టిలో కాల్చి బంగారాన్ని మెరిపించినట్లు. మీ పేదరికం, పాపాలు తొలిగిపోతాయి. హజ్ చేసిన తరువాత అల్లాహ్ మీకు జన్నత్‌ను ప్రతిఫలంగా ప్రసాదిస్తాడు.

*(నిదాయేషాహీ సౌజన్యంతో)*

# పవిత్ర ఖుర్ ఆన్ ఉపదేశం

**ముఫ్తీ ముహమ్మద్ ఫారూఖ్ అల్ ఖాసిమీ**

అమిత దయాళువు, అనంత కరుణామయుడు అయిన అల్లాహ్ పేరుతో...

## అల్లాహ్ గుణగణాలు

1. అల్ హద్ దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్
తర్జుమా: "సకల స్తోత్రాలూ సకల లోకాలకూ ప్రభువయిన అల్లాహ్ కొరకే!"
2. అర్రహ్మా నిర్రహీమ్
తర్జుమా: "అమిత దయామయుడు, అనంత కారుణ్యమూర్తి"
3. మాలికి యౌమిద్దీన్
తర్జుమా: "న్యాయం మరియు ప్రతిఫల దినానికి యజమాని"

### వ్యాఖ్యాన సారాంశం

మొదటి గుణం (సకల లోకాలకూ ప్రభువు) మనకు తెలియజేస్తున్నదేమిటంటే సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్ ఈ సమస్త విశ్వాన్ని సృష్టించిన విషయం మాత్రమే కాకుండా ప్రపంచంలో ప్రతి ప్రాణికి ప్రభవించిన తర్వాత ప్రాప్తమవుతూ ఆయన ద్వారానే అది పోషించబడుతోంది. అనే విషయమూ వాస్తవమే. ఆయనే అందరినీ పోషిస్తున్నాడు, తర్ఫీదునిస్తున్నాడు. చివరకు చెట్లకుగాలి,

నీరు, నేల ద్వారా లభిస్తున్న జీవత్వం, పోషణ సైతం వాస్తవానికి అల్లాహ్ తరపున కొనసాగే పోషణలో భాగంగానే లభిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే సమస్తమూ ప్రసాదించేది ఆయనే అనగా ఆయన కేవలం జీవరాశు లను సృష్టించి పోషణకు సంబంధించిన (అనగా జీవరాశు ల అవసరాలను తీర్చడం) బాధ్యతలను మరొకరిపై మోపలేదు. సమస్త జీవరాశుల జననం ఏ విధంగానయితే ఆయన ద్వారా సంభవిస్తోందో అదే విధంగా వాటి పోషణ కూడా ఆయన ద్వారానే కొనసాగుతోంది. ఆయన ప్రభుత్వ గుణం విశ్వంలోని ప్రతి అణువుతోనూ సంబంధాన్ని కలిగి ఉంది.

ఇక సర్వసృష్టి కర్త అయిన అల్లాహ్‌కు చెందిన రెండవ మరియు మూడవ గుణాలు (అమిత దయామయుడు, అనంత కారుణ్యమూర్తి) కొంత మంది ప్రజలు దేవుడిని ఆగ్రహోదగ్రునిగా, ఉగ్రునిగా భావిస్తున్నప్పటికీ వాస్తవానికి ఆయన అనంత కరుణామయుడని, అమిత దయామయుడని తెలియజేస్తున్నాం. జీవరాశులను సృష్టించడం, ఆ తర్వాత వాటిని పోషించడం, వాటి అవసరాలను తీరుస్తూ ఉండడం మొదలయిన చర్యలు ఆయన కారుణ్యపు మహిమలే. ఆయనలో కారుణ్యగుణం ఎంతటి స్థాయిలో ఉందంటే దానిని వివరించేందుకై అర్రహ్మాను (అమిత దయామయుడు) అని పేర్కొన్న తర్వాత 'అర్రహీము (అనంత కారుణ్యమూర్తి) అని కూడా పేర్కొనవలసిన అవసరముంది.

నాల్గవ గుణం (న్యాయం మరియు ప్రతిఫల దినానికి యజమాని) ఆయన అందరికీ ప్రభువు. అమిత దయామయుడు, అనంత కారుణ్యమూర్తి అవడంతో పాటు న్యాయం చేసే పరిపూర్ణ న్యాయమూర్తి కూడా! అనే విషయాన్ని వెల్లడిస్తుంది. ఆయనకు చెందిన ఈ గుణం న్యాయం కొరకు, ప్రతిఫలం కొరకు నిర్ణయించ బడిన ప్రత్యేకమైన రోజే (ప్రళయదినాన) సంపూర్ణ స్థాయిలో వ్యక్తమవుతుంది. ఈ విధంగా ఈ మూడవ గుణం గురించి ప్రస్తావించడం ద్వారా అందరికీ తెలియజేయబడిన విషయమేమిటంటే ఆయన (సృష్టికర్త అయిన అల్లాహ్) సకల జీవరాశులనూ సృష్టించి పోషిస్తూ అమిత దయామయునిగా, అనంత కారుణ్యమూర్తిగా విరాజిల్లుతున్నాడంటే ఆయన నేరస్థులను కూడా శిక్షించకుండా విడిచిపెడతాడని, దుర్మార్గుడయిన కుమారుడిని సైతం తన మమత కారణంగా ప్రేమిస్తూనే ఉండే తల్లి వలె ఆయన కూడా నేరస్తులను, ధిక్కారులను సైతం కరుణిస్తాడని ఎవరూ భావించకూడదు. వాస్తవానికి ఆయన సకల లోకాలకు, సమస్త జీవరాశులకు ప్రభువు. అమిత దయామయుడు, అనంత కారుణ్యమూర్తి అనడంతో పాటు శిక్షా బహుమానాలను ప్రసాదించేవాడు కూడా. భవిష్యత్తులో రాబోయే ఒకానొక యుగంలో ఆయనకు చెందిన ఈ గుణం ఏ స్థాయిలో వ్యక్తమవుతుందంటే ఆ యుగం పూర్తిగా శిక్షా బహుమానాలతో కూడిన యుగమవుతుంది. అనగా ఆ లోకం తినడానికి, త్రాగడానికి, డబ్బు సంపాదించడానికి, దైవారాధనలో నిమగ్నమవడానికి ఉద్దేశించబడినదిగా కాకుండా కేవలం శిక్షా బహుమానాలకు, న్యాయానికి ఉద్దేశించబడినదయి ఉంటుంది. ప్రతిఫలాన్ని అరబీ భాషలో 'దీన్' అంటారు. అందుకే ఆ దినాన్ని 'యౌముద్దీన్' (ప్రతిఫలదినం) అని పేర్కొనడం జరిగింది.

ఖుర్ఆన్ గ్రంథం ప్రారంభంలోనే ఈ చిన్న చిన్న వాక్యాలలోనే సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్‌కు చెందిన గుణాల గురించి ఏ వివరణనయితే అందజేసిందో దానికి లోతుగా పరిశీలించినట్లయితే అర్థం చేసుకునే వారికి ఆ వివరణే సరిపోతుంది. కానీ ఖుర్ఆన్ అల్లాహ్ ద్వారా అవతరింపజేయబడిన ఆఖిరి సందేశాత్మక గ్రంథం కావడంతో దాని తర్వాత మరే ఇతర సందేశాత్మక దైవగ్రంథమూ అవతరించే అవకాశం లేకపోవడంతో 'దేవుని గుణగణాలు' వంటి ముఖ్యమైన అంశానికి సంబంధించిన వివరణను అందజేసే సందర్భంలో ఖుర్ఆన్ క్లుప్తతకు ప్రాధాన్యమివ్వకుండా సుదీర్ఘంగా వివరణను అందించేందుకే ప్రాధాన్యతనిచ్చింది. అందుకే

ఖుర్ ఆన్‌లో వేలాది చోట్ల నిజంగానే వేలాది చోట్ల దేవుని గుణగణాలకు సంబంధించిన వివరణ అందించబడింది. కొన్ని ఖురాఆన్ వాక్యాలు క్రింది పేర్కొనబడుతున్నాయి. పాఠకుల సౌలభ్యం కోసం మేము అల్లాహ్ గుణాల పేరుతో మకుటాలను పొందుపరుస్తూ వాటికి సంబంధించిన ఖుర్ ఆన్ వాక్యాలను క్రింద పేర్కొంటున్నాం.

## అల్లాహ్ సర్వజ్ఞుడు ఏ వస్తువూ ఆయన జ్ఞానపరిధికి అతీతంగా లేదు

ఖుర్ ఆన్ మనకు తెలిపేదేమిటంటే సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్‌కు ప్రతి చిన్న, పెద్ద బహిరంగంగా ఉండే దాగి యుంటే వస్తువులన్నింటికీ సంబంధించిన జ్ఞానముంది. ఆయన అన్నింటినీ చూసే వాడు. వినేవాడు. ఆయన ప్రతి వస్తువుకూ సమీపంలో ప్రతి ఒక్కరి వెంట ఉన్నాడు. ఖుర్ ఆన్‌లో 'ఆలి ఇమ్రాన్' అనే సూరహ్‌లో ఇలా పేర్కొనబడింది.:

(''అల్లాహ్ సర్వజ్ఞుడు) భూమ్యాకాశాలలో ఏ వస్తువూ అల్లాహ్‌కు గోప్యంగా లేదు'' (ఖుర్ ఆన్ 3:5)

ఇదే విషయం మరి కొంత వివరణతో ఖుర్ ఆన్‌లోని 'అన్ఆమ్' అనే సూరహ్‌లో ఈ కింది విధంగా పేర్కొనబడింది.

"ఆ అల్లాహ్‌యే ఆకాశంలోనూ, భూమిలోనూ ఉన్నాడు. (అనగా భూమ్యాకాశాలతో కూడిన సమస్త విశ్వానికీ ఆయనే దేవుడు. యజమాని, ప్రభువు) మీరు దాచే విషయాలూ, బయటికి వెల్లడించే విషయాలూ ఆయనకు తెలుసు. అలాగే మీరు చేసే పనులకు సంబంధించిన జ్ఞానమూ ఆయనకు ఉంది." (ఖుర్ ఆన్ 6:3)

ఖుర్ఆన్‌లోని 'ఆన్ఆమ్' సూరహ్‌లోనే అల్లాహ్‌కు చెందిన ఈ గుణం గురించే మరొక వాక్యంలో ఈ క్రింది విధంగా పేర్కొనబడింది.

''ఆయన కనిపించే, కనిపించని విషయాలన్నింటికీ సంబంధించిన జ్ఞానం కలవాడు (ఆ సర్వజ్ఞాన సంపత్తితో పాటు) వివేకం కలవాడు మరియు ప్రతి వస్తువు పట్ల నిత్యం అవగాహన కలవాడు'' (ఖుర్ ఆన్ 6:73)

ఖుర్ఆన్‌లోని 'ఖనస్' అనే సూరహ్‌లో ఇదే విషయం ఈ విధంగా పేర్కొనబడింది.

''వారు తమ హృదయాలలో దాచిన రహస్యాలు, బహిరంగంగా పలికే మాటలు, కార్యాలు నీ ప్రభువుకు తెలుసు. ఆయనే అల్లాహ్. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఇహ పరలోకాలలో ఆయనే సకల స్తోత్రాలకూ అర్హుడు. సమస్త అధికారమూ ఆయనకే హస్తగతమయి ఉంది. మీరంతా ఆయన వైపునకే మరలిపోవాల్సి ఉంది'' (ఖుర్ఆన్ 28 : 69 - 79)

ఖుర్ఆన్‌లోని 'యూనుస్' అనే సూరహ్‌లో ఈ విధంగా పేర్కొనబడింది.

"మానవులారా! మీరు ఏ పని చేస్తున్నా ఆ పనిలో మీరు నిమగ్నమయి ఉన్నప్పుడు మేము మిమ్మల్ని చూస్తూనే ఉంటాం. (అనగా మీరు ఏ పని చేసినా నేను చూస్తుండగానే చేస్తారు. మీరు నన్ను చూడలేక పోయినప్పటికీ నేను అక్కడే ఉండి అన్నీ చూస్తూనే ఉంటాము) భూమ్యాకాశాలలో ఉన్న రవ్వంత వస్తువు సైతం మీ ప్రభువుకు గోప్యంగా లేదు." (ఖుర్ఆన్ 10:61)

దాసులతో తన సామీప్యం గురించి తెలిపేందుకై ఖుర్ఆన్‌లోని ''అల్ బఖరహ్' అనే సూరహ్‌లో అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు.

"ఓ ప్రవక్తా! నా దాసులు నా గురించి ప్రశ్నిస్తే నేను వారికి సమీపంలోనే ఉన్నానని తెలుపు" (ఖుర్ఆన్ 2:186)

ఖుర్ఆన్‌లోని 'ఖాఫ్' అనే సూరహ్‌లో అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు.

''మేము మానవుడిని సృష్టించాం. అతడి మనసులో మెదిలే ఊహలు, ఆలోచనలు సైతం మాకు తెలుసు. మేము అతడి కంఠ రక్తనాళం కంటే కూడా అతడికి చాలా సమీపంలో ఉన్నాము'' (ఖుర్ఆన్ 50:16)

అలాగే ఖుర్ఆన్‌లోని 'ముజాదలహ్' అనే

సూరహ్‌లో దాసులతో తన సామీప్యం గురించి అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు.

‘‘ముగ్గురు వ్యక్తులు కలిసి రహస్యంగా మంతనాలు జరిపినప్పుడు వారి మధ్య నాలుగోవాడిగా అల్లాహ్ లేకుండా ఉండడం అనేది ఎన్నడూ జరగలేదు. అలాగే ఐదుగురు వ్యక్తులు కలిపి రహస్యంగా మంతనాలు జరిపినప్పుడు వారిలో ఆరోవాడుగా అల్లాహ్ లేకుండా ఉండడం అనేది కూడా ఎన్నడూ జరగదు. రహస్యాలోచనలు జరిపేవారు వీరికంటే తక్కువమంది ఉన్నా లేక ఎక్కువ మంది ఉన్నా వారు ఎక్కడ ఉన్నా అల్లాహ్ వారితో పాటు ఉంటాడు’’ (ఖుర్ఆన్ 58 : 7)

అలాగే ఖుర్ఆన్ లోని ‘అన్నిసా’ అనే సూరహ్‌లో తోటి మానవుల విషయంలో సిగ్గుపడుతూ, అల్లాహ్ పట్ల సిగ్గుపడని వ్యక్తుల గురించి అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు.

‘‘వారు తమ దుష్కర్మలను మానవులకు తెలియకుండా దాచగలరు. కానీ అల్లాహ్‌కు తెలియకుండా దాచలేరు. రాత్రులలో వారు ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా రహస్య సమాలోచనలు జరిపే సమయంలో కూడా ఆయన వారితో ఉంటాడు’’ (ఖుర్ఆన్ 4: 108)

ఈ వాక్యాలలోనే కాకుండా ఖుర్ఆన్ ఇంకా ఎన్నో చోట్ల అల్లాహ్‌కు చెందిన ఈ ‘సంపూర్ణ జ్ఞానం’ అనే గుణాన్ని ‘అలీమ్’ (జ్ఞాని) అనే పదం ద్వారా పేర్కొన్నది.

# హజ్ యాత్ర-సందేహాలు-సమాధానాలు

1) విజయవాడ వించిపేట్ నుంచి తాహెరా బానో, కరీంషేక్

ప్రశ్న: 2015లో హజ్ కమిటీ తరపున నేను, నా కుమారుడు హజ్ యాత్ర చేశాం. అయితే ఇటీవల నా భర్త, కూతురు చనిపోయారు. భర్త తరపున నా కుమారుడు, నా కుమార్తె తరపున నేను హజ్ కమిటీ ద్వారా హజ్ ఎ బదల్ చేయాలనుకుంటున్నాం. సరైన సలహా ఇవ్వండి.

జవాబు: హజ్ కమిటీ తరపున కేవలం ఒక సారి మాత్రమే హజ్ యాత్ర చేయడానికి అవకాశం వుంది. కాబట్టి మీరు ప్రైవేట్‌గా హజ్ యాత్ర చేసి మీ ఆశయం నెరవేర్చుకోండి. మహిళ హజ్ విషయంలో మెహరం తప్పని సరి. కాబట్టి మీరు హజ్ కమిటీ నుంచి రిపీటర్‌గా వెళ్ళే అవకాశం లేదు. అయితే మీ కుమారుడు మహిళా మెహరంగా, 70 ఏళ్ళు దాటిన వృద్ధుల కంపెనీయన్‌గా వెళ్ళటానికి అవకాశం వుంది. మీరు ప్రైవేట్‌గా, మీ కుమారుడు రిపీటర్‌గా వెళ్ళే అవకాశం వుంది.

2) ఉరుసాబేగం, నందిగామ

ప్రశ్న: 2013, 2014, 2015 వరుసగా హజ్ యాత్ర కోసం దరఖాస్తు చేసుకున్నాం. అయితే డ్రాలో మా కవర్ నెంబర్ రాలేదు. నాల్గవ సారి దరఖాస్తు చేయడానికి 2016లో ఆర్థిక ఇబ్బందులు అడ్డు వచ్చాయి. కాబట్టి దరఖాస్తు ఇవ్వలేదు. దేవుడి దయతో ఈ ఏడాది హజ్‌కు వెళ్ళడానికి అవకాశం వుందా? బి క్యాటగిరి మాకు వర్తిస్తుందా?

జవాబు: సెంట్రల్ హజ్ కమిటీ గైడ్ లైన్స్ ప్రకారం మీకు బి-క్యాటగిరి వర్తించదు. ఒక ఏడాది గ్యాప్ వచ్చింది. మళ్ళీ లెక్క మొదటి నుంచే వస్తుంది. ఒక వేళ మీరు 2016లో బి-క్యాటగిరి కింద

దరఖాస్తు చేసి చివరి నిమిషంలో ఆర్థిక ఇబ్బందులవల్ల ప్రమాణం రద్దు చేసుకుంటున్నట్లు డిక్లరేషన్ ఇచ్చి వుంటే మీకు ఈ ఏడాది బి-క్యాటగిరి కింద వెళ్ళే అవకాశం వచ్చేది. మీరు జనరల్ క్యాటగిరిలో దరఖాస్తు చేసుకోవాలి. డ్రా ద్వారానే సెలక్షన్ అవుతుంది.

3) షేక్ హుస్సేన్, చీరాల

ప్రశ్న: పాస్‌పోర్ట్ ప్రకారం నాకు 70వ సంవత్సరం నడుస్తోంది. నా భార్యకు 60 సంవత్సరాలు. నేను నా భార్య కలిసి హజ్ యాత్ర చేయవచ్చా? ఇంత వరకు మేం హజ్ చేయలేదు. ఎ-క్యాటగిరి నాకు వర్తిస్తుందా?

జవాబు: 70 సంవత్సరాలు దాటిన వారు. అంటే 1-1-1947 కంటే ముందు పుట్టినవారై వుండాలి. అప్పుడే ఎ-క్యాటగిరి కిందికి వస్తారు. మీరిద్దరు జనరల్ క్యాటగిరిలో దరఖాస్తు చేసుకోవాలి. మీ భార్యకు మెహరంగా మీరుంటారు. డ్రా ద్వారానే మీ సెలక్షన్ జరుగుతుంది. ఈ ఏడాది మీరు ఎ-క్యాటగిరి పరిధిలోకి రారు.

4) షేక్ నాగుల్‌మీరా, కడప

ప్రశ్న: పదేళ్ళ క్రితం వైట్‌పాస్‌పోర్ట్‌పై హజ్ కమిటీ తరపున హజ్‌కు వెళ్ళాను. మళ్ళీ ఈ ఏడాది నా భార్యతో కలిసి హజ్ చేయాలనుకుంటున్నాను. నా పాస్‌పోర్ట్‌పై గతంలో హజ్ చేసినట్లు స్టాంప్ లేదు. కాబట్టి హజ్ దరఖాస్తుతో పాటు డిక్లరేషన్‌లో నేను గతంలో హజ్ చేసినట్లు ప్రకటించకపోతే ఏమైనా ఇబ్బందా? నా కవర్‌నెంబర్‌కు సంబంధించిన సమాచారం హజ్ కమిటీ వద్ద వుంటుందా? మొదటి సారి హజ్‌కు వెళ్తున్నట్లు రాస్తే వచ్చే సమస్య ఏమిటి?

జవాబు: మీరు పవిత్రమైన హజ్ యాత్రకు వెళ్తున్నారు. అల్లా గృహానికి వెళ్తూ అబద్ధం చెప్పడం ఇస్లాం ధర్మానికే విరుద్ధం. మీరు తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ఇబ్బంది పడక తప్పదు. సెంట్రల్ హజ్ కమిటీ వద్ద గతంలో హజ్ చేసిన వారి సమాచారమంతా వుంది. నిబంధనల ప్రకారం మీరు, మీ భార్య డబ్బులన్నీ చెల్లిస్తారు. విమానాలు బయలుదేరే సమయంలో మీ టికెట్ కన్‌ఫాం కాదు. మీతో పాటు మీ భార్య హజ్ యాత్ర చేయడానికి చెల్లించిన మొత్తం డబ్బులు అప్పుడు జప్తు చేస్తున్నట్లు సెంట్రల్ హజ్ కమిటీ మీకు నోటీసు ఇస్తుంది. దీన్ని మీరు కోర్టులో సవాలు చేయడానికి కూడా అవకాశం లేదు. కాబట్టి హజ్‌యాత్రకు సంబంధించి ఎలాంటి అబద్ధపు సమాచారం ఇవ్వరాదు.

5) షేక్ రెహ్మతుల్లా, గుంటూరు

ప్రశ్న: అన్నం, పప్పు తినడం అలవాటు. హజ్ సందర్భంగా గ్రీన్‌లో వండుకోవడానికి అవకాశం లేదంటున్నారు. అన్నం, పప్పు మక్కా, మదీనాలోని హొటల్స్‌లో దొరుకుతుందా?

జవాబు: పరాయి దేశం. అక్కడివారి ఆహారపు అలవాట్లు వేరు. మీరు ఇప్పట్టి నుంచే రోటీ తినడం అలవాటు చేసుకోండి. కొంత మంది కేరళ వాళ్ళు అక్కడ హొటల్స్ నడుపుతున్నారు. వారి వద్ద అన్నం, పప్పు, ఆవకాయ లాంటివి కూడా దొరుకుతాయి. అయితే ఆ హొటల్స్ ఎక్కడ వున్నాయో అక్కడి వరకు మీరు వెళ్ళాలి. మీ దగ్గర డబ్బులుంటే మీరు కోరుకున్న ఆహారం దొరుకుతుంది. కానీ మీరు ఓ

పవిత్రమైన ఉద్దేశంతో హజ్ యాత్రకు వచ్చారు. మీలో మార్పు రావాలి. ఆధ్యాత్మికంగా, మానసికంగా, శారీరకంగా మీ ఆలోచన ధోరణి మార్చుకోవడానికి ప్రయత్నించండి. మీకు అందుబాటులో వున్న ఆహారాన్ని సంతోషంగా తిని ఎక్కువ సమయం ఆధ్యాత్మికంగా గడపండి.

6) సయ్యద్ ఫారూఖ్, నంద్యాల

ప్రశ్న: నేను ప్రభుత్వ ఉద్యోగిని. రిటైర్‌మెంట్ తరువాత హజ్ యాత్రకు వెళ్ళాలని వుంది. నా ఫ్రెండ్స్ ఆరోగ్యంగా వున్నప్పుడే హజ్ యాత్ర చేసుకోవాలని చెబుతున్నారు. ప్రైవేట్‌గా లేదా హజ్ కమిటీ తరపున హజ్ కు వెళ్ళడానికి ఖర్చులో ఎంత తేడా వస్తుంది?

జవాబు: హజ్‌యాత్ర చేయడానికి కావాల్సిన డబ్బు మీ దగ్గర ఉంటే ఆరోగ్యంగా వున్నప్పుడే వెంటనే హజ్‌యాత్రకు సిద్ధం కాండి. 50 సంవత్సరాల లోపే హజ్ యాత్ర పూర్తి చేసుకుంటే శారీరకంగా ఫిట్‌గా వుంటారు. 2016లో హజ్‌కమిటీ తరపున వెళ్ళిన హాజీలు అజీజియా క్యాటగిరిలో ఒక లక్షా 85వేలు, గ్రీన్ క్యాటగిరిలో వున్న వారు 2 లక్షల 19 వేలు చెల్లించారు. ప్రైవేట్‌గా వెళ్ళిన వారు మూడున్నర లక్షల నుంచి ఐదు లక్షల వరకు లగ్జరీని బట్టి చెల్లించారు. సౌదీ రియాల్ రేట్‌ను బట్టి హాజీ చెల్లించాల్సిన డబ్బు ఎంత అనేది, హజ్‌కు రెండు మూడు నెలల ముందు తెలుస్తుంది.

# మైనారిటీల సంక్షేమం-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ధ్యేయం

ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంస్థ రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో (శ్రీకాకుళం జిల్లా తప్ప) కార్యాలయాలు ఏర్పాటు చేసింది.

2011 జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో మైనారిటీల జనాభా 31.66 లక్షలు (క్రిష్టియన్లను మినహాయించి) ఇందులో ముస్లింలు 31.33 లక్షలు సిక్కులు 0.07, బౌద్ధులు 0.03 లక్షలు, జైనులు 0.22 లక్షలు మరియు పారశీకులు 0.01 లక్షలు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంస్థ మైనారిటీ వర్గాల వారికి ఈ క్రింది పథకముల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నది.

1 రాష్ట్ర ప్రభుత్వ పథకాలు :

ఎ) బ్యాంకుల ద్వారా సబ్సిడీ పథకము.

బి) రోషిణి పథకము,

సి) ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ అండ్ ప్లేస్‌మెంట్ పథకము.

డి) న్యాయశాస్త్ర పట్టభద్రులకు శిక్షణ మరియు ఆర్థిక సహాయం.

ఎ) బ్యాంకుల ద్వారా సబ్సిడీ పథకం : ఈ పథకంలో మైనారిటీలు వివిధ స్వయం ఉపాధి పథకాలు ప్రారంభించుటకు రూ॥ 2.50 లక్షలు ఆర్థిక సహాయం అందించబడుతుంది. అదే విధంగా రవాణా పథకాలకు రూ॥ 3.00 లక్షల వరకు ఆర్థిక సహాయం చేయబడును. బ్యాంకులు మంజూరు చేసి ఋణం మొత్తంలో 50 శాతం లేక రూ॥ 1 లక్షకు మించకుండా సబ్సిడీ మంజూరు చేయబడును. బ్యాంకులు యూనిట్ విలువలో 50% ఋణం అందిస్తాయి. ఈ పథకానికి కావలసిన అర్హతలు :

1. లబ్ధిదారులు మైనారిటీ వర్గానికి చెందిన వారై ఉండాలి.

2) వయస్సు 21 నుండి 55 సం॥లలోపు ఉండాలి. 3) కుటుంబ వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాలలో రూ॥ 2.00 లక్షలు మరియు గ్రామీణ ప్రాంతాలలో రూ॥ 1.50 లక్షలకు మించకుండా ఉండాలి.

బి) రోషిణి పథకము :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2015-16 సం॥లో "రోషిణి" పథకాన్ని పునరుద్ధరించి అమలు పరుస్తుంది. దీంలో ముఖ్యంగా మైనారిటీ వితంతువులు, విడాకులు పొందిన వారు అనాథలు, వికలాంగులు మరియు ఇతర బాధితులు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని జీవించేవారు మరియు టైలరింగ్, ఎంబ్రాయిడరీ, చేనేత, బంగారు అభరణాలు చేసే వారు, కమ్మరి, కార్పెంటరీ, ఉడెన్ కార్వింగ్, సైకిల్ మరియు స్కూటర్ మెకానిజం తదితర అనేక చేతి వృత్తుల వారు ఈ పథకం క్రింద లబ్ధి పొందవచ్చును. ఈ పథకంలో రూ॥ 50,000/-ల వరకు స్కీంను బట్టి ఆర్థిక సహాయం అందించబడుతుంది. యూనిట్ విలువ మొత్తంలో 60% కార్పోరేషన్ సబ్సిడీ కాగా 40% బ్యాంకు ఋణంగా ఉంటుంది.

పై పథకాలకు దరఖాస్తు చేసుకునే విధానం :

ని

1) ఈ పథకం క్రింద లబ్ధిపొందదలచిన దరఖాస్తుదారులు ఆన్‌లైన్ (OBMMS) www.apsmfc.com దరఖాస్తు చేసుకోవాలి.

2) ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత దరఖాస్తు ఫారమ్ ప్రింట్ తీసుకోవాలి.

3) ప్రింట్ తీసుకున్న దరఖాస్తు ఫారాన్ని క్రింద తెలిపిన సర్టిఫికేట్స్ జతచేసి సంబంధిత మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్/మున్సిపల్ కమీషనర్ (మున్సిపాలిటీ అయితే)/జోనల్ కమీషనర్ (మున్సిపల్ కార్పొరేషన్ అయినట్లైతే)కు సమర్పించాలి. 4) తహశీల్దార్ చే జారీ చేయబడిన ఆదాయ ధృవపత్రం (తెల్ల రేషన్ కార్డుదారులు దాని కాపీ జతచేస్తే సరిపోతుంది). 5) రేషన్ కార్డు జిరాక్స్ కాపి 6) ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీ 7) ఒక పాస్‌పోర్టు సైజు ఫోటో.

సి) ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ అండ్ ప్లేస్‌మెంట్ పథకము :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గ ఆర్థిక సంస్థ మైనారిటీ నిరుద్యోగులకు వివిధ రంగాలలో ఉచిత శిక్షణా కార్యక్రమాల ద్వారా నైపుణ్యాన్ని పెంపొందించడుకి పూనుకొన్నది. దీని ద్వారా మైనారిటీ యువకులు ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుచుకోవటమే కాకుండా వారి యొక్క ఆర్థిక వికాసానికి తోడ్పడుతుంది. మైనారిటీ నిరుద్యోగులకు వారి యొక్క విద్యార్హతల ఆధారంగా నాల్గు అంచెల ఉచిత ట్రైనింగ్ వసతితో కూడిన లేదా డేస్కాలర్ పద్దతిలో అమలు చేయటం జరుగుతుంది. డే స్కాలర్ ట్రైనీస్‌కు నెలకు రూ॥ 500/-లు స్టైఫండ్ ఇవ్వబడును. రెసిడెన్షియల్ ట్రైనీస్ కొరకు ఉచిత వసతి భోజన సదుపాయములు కల్పించబడును.

1) 10వ తరగతి కంటే తక్కువ విద్యార్హత, 2) 10వ తరగతి నుండి ఇంటర్మీడియెట్. 3) డిగ్రీ పాసైన వారికి 4) పోస్ట్ గ్రాడ్యుయేషన్ మరియు వృత్తి విద్యా కోర్సులు.

ఈ పథకం క్రింద కావలసిన అర్హతలు :

1)కుటుంబ వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతంలో రూ॥ 2.00 లక్షలు గ్రామీణ ప్రాంతంలో రూ॥ 1.50 లక్షలు మించకుండా ఉండాలి. 2) స్వయం ఉపాధి పథకాలు, శిక్షణ ఉపాధి పథకాలుకుగాను వయస్సు 18 సం॥ల నుండి 33 సంవత్సరములుగా నిర్ణయించబడినది. 3) దరఖాస్తుదారులు మైనారిటీ నిరుద్యోగులుగా ఉండాలి. 4) స్త్రీలకు ప్రాధాన్యత ఇవ్వబడును.

న్యాయశాస్త్ర పట్టభద్రులకు శిక్షణ మరియు ఆర్థిక సహాయం :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ వర్గాలలోని లా గ్రాడ్యుయేట్స్‌కు న్యాయ పరిపాలన పరమైన ట్రైనింగ్ ఇవ్వటానికి ఆర్థిక సహాయం అందిస్తుంది. ఈ పథకం క్రింద ప్రతి సంవత్సరం లా గ్రాడ్యుయేట్స్‌ని ఎంపిక చేసి వారికి

జిల్లా కోర్టు, సెషన్స్ కోర్టు, తాలూకా కోర్టు మొ॥లగు కోర్టులలో పనిచేసే జి.పి., పి.పి.తో జతపర్చి ట్రైనింగ్ ఇవ్వటం జరుగుతుంది. ఈ కోర్సు సమయంలో అభ్యర్థికి ఈ క్రింది సదుపాయములు సమకూరుస్తుంది.

1) కోర్సు సమయంలో నెలకు రూ॥ 1,000/-ల చొప్పున 3 సం॥ల పాటు స్టైఫండ్ ఇవ్వబడును.

2) కోర్సు మొదటి సం॥లో పుస్తకములు మరియు ఫర్నీచర్ కొనుగోలు చేసుకునే నిమిత్తం రూ॥ 6,000/-లు ఒక్క సారి గ్రాంట్ క్రింద ఇవ్వబడును.

3) అభ్యర్థి కోర్సు సమయంలో తన నైపుణ్యానికి పెంపొందించుకునే నిమిత్తం సెమినార్స్, వర్క్‌షాప్స్, సిపోజియం మొదలైన వాటికి హాజరుకావటానికి సంవత్సరానికి రూ.2000/-లు అందించబడుతుంది.

4) ప్రతి అభ్యర్థికి తన బార్ కౌన్సిల్ అభ్యర్థిత్వాన్ని నమోదు చేసుకునేందుకు రూ.585/-లు ఒక్క సారి గ్రాంట్ క్రింద ఇవ్వబడును.

5) ఈ పథకం క్రింద అభ్యర్థుల ఎంపిక ఆయా జిల్లా కలెక్టర్లకు అప్పగించడమైనది.

పై పథకాలకు దరఖాస్తు చేసుకోవటానికి అర్హతలు:

1. లబ్దిదారులు మైనార్టీ వర్గానికి సంబంధించిన వారై వయస్సు 21 సంవత్సరాల నుంచి 40 సం. లోపు ఉండాలి. 2) న్యాయశాస్త్ర పట్టబద్రులై ఉండాలి. 3) కుటుంబ వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాలలో రూ.2.00 లక్షలు, మరియు గ్రామీణ ప్రాంతాలలో రూ.1.50 లక్షలకు మించరాదు.

ఈ పథకం క్రింద దరఖాస్తు చేసుకునే విధానం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అల్పసంఖ్యాక వర్గ ఆర్థిక సంస్థ వైబ్‌సైట్ www.apsmfc.com లో లా గ్రాడ్యుయేట్స్ ఆన్‌లైనర్ దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి, ప్రింట్ తీసుకొని దరఖాస్తు ఫారాన్ని ఈ క్రింద తెలిపిన సర్టిఫికేట్లు జతచేసి సంబంధిత జిల్లా మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు సమర్పించాలి.

1) తహశీల్దార్ చే జారీ చేయబడిన ఆదాయ ధృవపత్రం (తెల్ల రేషన్ కార్డుదారులు దాని కాపీ జతచేస్తే సరిపోతుంది).

2) ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీ, 3) న్యాయశాస్త్ర పట్ట, ఫోటోస్టాట్ కాపీ, 4) ఎస్ ఎస్ సి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ కాపీ.

భారత ప్రభుత్వంచే స్కాలర్‌షిప్ స్కీమ్:

**ఎ) ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్:**

1) 1వ తరగతి నుంచి 10వ తనగతి చదువుతున్న మైనార్టీ విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ ఇవ్వబడును. కుటుంబ ఆదాయం రూ.1.00 లక్షలకు మించరాదు.

2) విద్యార్థి ముందు తరగతిలో కనీసం 50 శాతం మార్కులు సాధించి ఉండాలి.

**బి) పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్:**

ఈ నథకం క్రింద ఇంటర్ నుంచి పి.జి వరకు చదువుతున్న మైనార్టీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ ఇవ్వబడును.

1) కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలకు మించరాదు.

2) విద్యార్థి ముందు తరగతిలో కనీసం 50 శాతం మార్కులు సాధించి ఉండాలి.

సి) మెరిట్ కం మీన్స్ స్కాలర్ షిప్:

1) కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలకు మించరాదు.

2) విద్యార్థి ముందు తరగతిలో కనీసం 50 శాతం మార్కులు సాధించి ఉండాలి.

పై పథకాలకు దరఖాస్తు చేసుకొనే విధానం.

https://scholarship.gov.in వైబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి.